

● ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు సంచి కత్తిరించి అందులో ఉన్న రూ. 1.30 లక్షల నగదు అపహరించారు. కొద్దిసేపటి తర్వాత విషయాన్ని గుర్తించిన బాధితురాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బద్వేలు బస్టాండ్‌లో ఇటీవల ఈ ఘటన చోటుచేసుకుంది.

● కడప ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు ఎక్కేందుకు వెళ్తుండగా ఇద్దరు దొంగలు బ్యాగును కత్తిరించి రూ. 5 లక్షల విలువజేసే బంగారు నగలను కాజేశారు. ఆ తర్వాత పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరిని అరెస్టు చేశారు.

● కడప ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా బ్యాగులో ఉన్న చిన్న పర్సును దొంగలు అపహరించారు. అందులో రూ. 5 వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు ఉండటంతో ఆమె లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.

సందట్లో చోరీమియా

◆ స్త్రీశక్తితో పెరిగిన ప్రయాణికుల సంఖ్య
◆ ప్రధాన బస్టాండ్లలో లోపించిన నిఘా

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళల మేలు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తోంది. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో బస్టాండ్లు, కిటకిటలాడే బస్సులు, రద్దీ ప్రదేశాలే లక్ష్యంగా చేసుకుని దొంగలు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రయాణికుల్లా వేడి ఉంటూ... రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో బ్యాగులను కత్తిరిస్తూ నగదు, విలువైన ఆభరణాలను దొంగిలిస్తున్నారు. ఈ తరహా ఉదంతాలు ఇటీవల జిల్లాలోని బస్టాండ్లలో ఎక్కువగా చోటుచేసుకుంటుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.




ప్రయాణికులతో కిటకిటలాడుతున్న కడప ఆర్టీసీ బస్టాండ్

జాగ్రత్తలు ఎంతైనా అవసరం

● రద్దీ వేళ ప్రయాణికులు కూడా దొంగలబారిన పడకుండా జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. ● బంగారు నగలు, నగదు భద్రపరుచుకున్న బ్యాగుల జిప్ ఎప్పుడూ తమ ఎదుటి వైపు ఉండేలా చూసుకోవాలి. ● బస్సు ఎక్కే ముందు.. దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండి సరి చూసుకోవాలి. ● అపరిచితులు కావాలని దగ్గరకు వస్తే జాగ్రత్త పడాలి. ● ప్రయాణ సమయంలో విలువైన వస్తువులను బహిరంగంగా ప్రదర్శించకపోవడం మేలు. ● బస్టాండ్లలో ఔట్‌పోస్టు పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది కనీసం ప్రతి అరగంటకు ఒకసారి పహారా కాయాల్సిందిగానే దొంగలు కొంత వెనకంజ వేసే అవకాశం ఉంది.

● **శుభ కాలం.. నిఘా వైఫల్యం:** శ్రావణ మాసం కావడంతో ప్రస్తుతం శుభకార్యాలు ఎక్కువగా ఉన్నాయి. మహిళలు బంగారు ఆభరణాలు ధరించి, బ్యాగుల్లో భద్రపరుచుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇదే సమయంలో దొంగలు చేతివాటం చూపుతుండడంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ విషయంలో బస్టాండ్లలోని ఔట్‌పోస్టు పోలీసులు, ఆర్టీసీ విజిలెన్స్ సిబ్బంది నిఘా లోపంపై విమర్శలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ సిబ్బంది నిత్యం బస్టాండ్లలో తిరుగుతూ అనుమానితులను గుర్తించాల్సి ఉంది. ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు. అసలు విధులను మరిచి స్వకార్యాలు చక్కబెట్టుకోవడంలో కొన్నిచోట్ల నిమగ్నమయ్యారు.

నిధుల ఖర్చు.. పూడిక తొలగితే ఒట్టు



బంగారు, వస్త్ర వ్యాపారంలో రెండో ముంబయిగా పేరొందిన ప్రొద్దుటూరులో మురుగు నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన మురుగు కాలువలైన మడూరు, కొత్తపల్లె, దొరసానిపల్లె, ప్రొద్దుటూరు-1, ప్రొద్దుటూరు-2 కాలువల్లోకి నిత్యం పూడిక, ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు చేరుతున్నాయి. పిచ్చి మొక్కలు, కంపచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో మురుగు ముందుకు పారే వీల్లేకుండా పోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా వ్యాధులు ప్రబలుతాయని జనం భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కాలువల మరమ్మతులు, పూడిక తొలగింపునకు పురపాలక సంఘం వార్షిక బడ్జెట్‌లో ఏటా దాదాపు రూ. 50 లక్షలు కేటాయిస్తోంది. అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మెరుగు కాకపోవడంపై పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు**

కడపలో ఓటు హక్కుపై నీలినీడలు!

◆ గాలిలో 75 వేల మంది భవితవ్యం
◆ అధికారుల ఆదేశాలు వివాదాస్పదం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: జాబితాను జల్లెడ పట్టి.. అనర్హులను ఏరివేసి.. అర్హులకు హక్కు కల్పించేందుకు చేపట్టిన ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమం(సర్) కడపలో కొత్త సమస్యను సృష్టిస్తోంది. ఈ ప్రక్రియలో ఎన్యుమరేషన్ పత్రాల జారీ నుంచి స్వీకరణ వరకు ఒక అంకం పూర్తయ్యింది. కడప నియోజకవర్గంలో అత్యధికంగా దాదాపు 75 వేల ఎన్యుమరేషన్ పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి. వీరందరికీ అధికారులు నోటీసులు అందజేయాల్సి ఉంది. ఓటర్లు అందుకు తగిన సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నోటీసుల అందజేత.. తదనంతరం ఓటర్లకు ఇవ్వాల్సిన పత్రాల జారీ అంతా ఓ ప్రహసనంగా మారింది. దీంతో 75 వేల మంది ఓటు హక్కుపై ఇప్పుడు నీలినీడలు అలముకున్నాయి.



కడప నగర పాలక సంస్థ మూడో డివిజన్ పరిధిలో ఓటర్ల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

అమలు తీరుపై విమర్శలు

సర్ ప్రక్రియను రెవెన్యూ శాఖ పర్యవేక్షిస్తోంది. కడపలో ఈ ప్రక్రియ కోసం 16 మంది ఏఈఆర్వోలను నియమించింది. వీరి పర్యవేక్షణలో 340 మంది బీఎల్వోలు పనిచేయాల్సి ఉంది. 16 మంది ఏఈఆర్వోల్లో 11 మంది నగరపాలక సంస్థ అధికారులున్నారు. బీఎల్వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు 29వ తేదీ నాటికి ఫారమ్ 6-5128, ఫారమ్7- 69, ఫారమ్8-5227 మందికి అందజేయాలి. వీటితో పాటు ఫారమ్13, 14(అభ్యంతరాలు తెలిపిన వ్యక్తికి ఇచ్చే నోటీసు), అనెక్సర్ 5(వేరే ప్రాంతంలో ఓటు నమోదుకు ఇచ్చే పత్రాలు), ఫారమ్ 15, 12(దరఖాస్తు విచారణ కోసం ఇచ్చే పత్రం), కొత్తగా ఓటర్ల నమోదుకు జారీ చేసే పత్రాలు, క్లెయిమ్స్ ఎంక్వయిరీ పత్రాలను సిద్ధం చేసి పోలింగ్ కేంద్రాలకు అందజేయాలి. ఈ ప్రక్రియ కడప నియోజకవర్గంలో అమలు చేస్తున్న తీరుపై ఇప్పుడు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీఎల్వోలపై పత్రాల ఖర్చు


సదరు పత్రాలను బీఎల్వోలే జిరాక్స్ తీసుకుని ఓటర్లకు అందజేయాలని పై అధికారులు ఆదేశాలిచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఇంత భారీ స్థాయిలో ఆ పత్రాలను సిద్ధం చేయలేక పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో దరఖాస్తుదారులపై సిబ్బంది ఆ భారాన్ని మోపుతున్నారు. కొత్తగా బీఎల్వోలుగా బాధ్యతలు అప్పగించిన 53 మందికి ఎలాంటి శిక్షణ ఇవ్వకపోవడంతోనూ ఈ ప్రక్రియ గందరగోళంగా మారింది. సర్ ప్రక్రియకు తగిన నిధులు విడుదలైనా స్టేషనరీ, పత్రాల ప్రింటింగ్, జిరాక్స్ వంటి అంశాల్లో అధికారులు వ్యవహరిస్తున్న తీరు బీఎల్వోలకు తీవ్ర సమస్యగా పరిణమించింది.

స్పందించి పరిష్కరిస్తేనే మేలు

ఎన్యుమరేషన్ పత్రాల జారీ నుంచే స్టేషనరీ సమస్య మొదలైంది. ఒక్కో ఓటరుకు రెండు పత్రాలు ఇవ్వాల్సి ఉండగా.. చాలా కేంద్రాల పరిధిలో ఒక్కటే అందించారు. ఓటరు వద్ద ఉంచుకోవాల్సిన పత్రం కోసం జిరాక్స్ చేయించుకోవాలని చెప్పడం వివాదాస్పదంగా మారింది. సగటున ఒక్కో ఓటరుకు కనీసం 3 పత్రాలనైనా ఇవ్వాల్సి ఉంటుంది. ఓటరు సొంత ఖర్చుతో తీసుకోవాలని సూచిస్తే అనాసక్తి చూపే అవకాశం ఉంది. ఫలితంగా సుమారు 75 వేల మంది ఓటర్ల భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి అన్ని రకాల పత్రాలను ఓటర్లకు సకాలంలో అందించి అర్హులకు ఓటు హక్కు దక్కేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫ్లోరైడ్ పీడ.. వెలిగొండతో విరగడ

◆ నేడు సాకారం కానున్న దశాబ్దాల కల




డ్రోన్లతో ఆకాశంలో ప్రదర్శిస్తున్న వెలిగొండ శంకుస్థాపన తేదీ

పోరుమామిళ్ల, బి.కోడూరు, న్యూస్‌టుడే: పూల వెంకట సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్.. మార్కాపురం జిల్లాలో రూపుదిద్దుకున్న ఈ జలాశయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం జాతికి అంకితం చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ నీరు జిల్లాలోని పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరులోని పలు పల్లెలకు ఇప్పుడు ఓ వర ప్రసాదం కానుంది. సుమారు 27,200 ఎకరాలకు సాగు.. మూడు మండలాలకు తాగు నీటిని అందించనుంది. దీంతో దశాబ్దాలుగా ఫ్లోరైడ్ నీటిని తాగుతూ సతమతం అవుతున్న పల్లెలకు త్వరలోనే ఆ పీడ విరగడ కానుంది. జల భద్రత చేకూరనుంది.

● **నింగిన వెలుగుల వైభవం:** చిరకాల స్వప్నం నెరవేరుతుండటంతో పోరుమామిళ్ల, కలసపాడులోని పల్లెలు సంబరాలు చేసుకుంటున్నాయి. వెలిగొండ వారోత్సవాల పేరుతో ఊరూరా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 'వెలిగొండ జలాలు - బద్వేలు నియోజకవర్గం భూములకు కొత్త సిరులు' అనే పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ చేశారు. సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఎల్ఈడీ డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు. అందులో వెలిగొండ ప్రాజెక్ట్, కృష్ణా జలాలు, సాగునీటి ప్రయోజనాలను ప్రతిబింబించే దృశ్యాలను ఆకాశంలో ప్రదర్శించారు. ఆకాశంలో వెలుగులు విరజిమ్ముతూ సాగిన ఈ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పిల్లలు, యువత, మహిళలు ఆసక్తిగా వీక్షించారు.

కష్టాలు తీర్చనున్న కృష్ణమ్మ ప్రవాహం



కొండాపురం, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాల జాడ లేక దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గండికోట జలాశయానికి కృష్ణవేణి చేరుతోంది. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి 3,500 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని ప్రస్తుతం విడుదల చేశారు. జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా 57 కిలో మీటర్లు ప్రయాణిస్తూ గండికోట సొరంగం నుంచి జలాశయానికి నీరు చేరుతోంది. కృష్ణమ్మ రాకతో గండికోటలో నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తినీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలకుగాను ప్రస్తుతం 12.70 టీఎంసీల నీరుంది. దీంతో తాగు నీటి సమస్య తీరుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భజే ఘననాథం



వినాయకచవితి వేడుకలు సమీపిస్తుండటంతో అప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో సందడి మొదలైంది. ప్రతిమల కొనుగోళ్లపై నిర్వాహకులు దృష్టి సారిస్తున్నారు. తయారీ కేంద్రాల వద్దకు వెళ్లి ఎంచుకున్న ప్రతిమల కొనుగోలుకు కొంతమొత్తం ముందస్తుగా చెల్లిస్తున్నారు. మరికొందరు అప్పుడే ఉత్సవ నిర్వహణ ప్రదేశాలకు విగ్రహాలను తరలించుకు వెళ్తున్నారు. దేవుని కడపకు చెందిన దుర్గా యూత్ నిర్వాహకులు రూ. 1.33 లక్షలతో 20 అడుగుల భారీ ప్రతిమను కొనుగోలు చేశారు. ఉత్సవ ప్రాంతానికి తరలించేందుకు ట్రాక్టర్ ట్రాలీలో ఎర్రగుంట్ల నుంచి ప్రొద్దుటూరు, మైదుకూరు మీదుగా కడపకు ఆదివారం ఇలా తరలిస్తూ కనిపించారు. - **న్యూస్‌టుడే, మైదుకూరు**

మయూరం.. నీదే వయ్యారం



సిద్దవటం, న్యూస్‌టుడే: జాతీయ పక్షి నెమలి. ప్రకృతిలోని సహజ సౌందర్యానికి, ఉల్లాసానికి ఇవి ప్రతీకగా నిలుస్తాయి. సిద్దవటం అటవీ రేంజ్‌లో వీటి సంఖ్య ఎక్కువ. ఆకాశంలో మేఘాలు కమ్ముకుని, వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మగ నెమళ్లు తమ తోడును ఆకర్షించడానికి పురివిప్పి ఆనందంతో నాట్యం చేస్తాయి. ఇలా దాహార్తి తీర్చుకునేందుకు అడవిలోని నీటి తొట్టె వద్దకు వచ్చిన ఓ మయూరం.. అదే సమయంలో ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో పక్కనే ఉన్న ఆడ నెమళ్లను ఆకర్షించడానికి ఇలా పురివిప్పి వయ్యారాన్ని ఒలకబోసింది. ఈ దృశ్యం పులుల గణనలో భాగంగా అధికారులు అడవుల్లో అమర్చిన ఆధునిక కెమెరాల్లో నిక్షిప్తమైంది.

సమస్యలా.. మీకోసం
అర్జీలు ఇవ్వొచ్చు ఏ రోజైనా!

● స్వర్ణ వార్డు, గ్రామ కార్యాలయాల్లో అమలు

కమలాపురం, న్యూస్‌టుడే: ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై అధికారులకు అర్జీలు ఇచ్చేందుకు ఇకపై సోమవారం వరకు వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ప్రజా సమస్యల పరిష్కారానికి గాను ప్రభుత్వం ప్రస్తుతం ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇకపై ఈ కార్యక్రమాన్ని ఇకపై స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లోనూ అన్ని పని దినాల్లో నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. స్థానిక కార్యాలయాల్లో సిబ్బందికి అర్జీలు, ఫిర్యాదులు అందజేస్తే సంబంధిత శాఖలకు వాటిని పంపి పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టనున్నారు.

● **3- 5 గంటల మధ్య స్వీకరణ:** జిల్లాలో 715 స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,272 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు డిప్యూటేషన్‌పై వివిధ జిల్లా కార్యాలయాల్లో పని చేస్తుండగా.. మిగిలిన వారు క్షేత్ర స్థాయిలో సర్వేలు, ఇతర విధుల్లో నిమగ్నమవుతున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో ఈ అంశంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఇకపై ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య సిబ్బంది తమ కార్యాలయాల్లో కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించింది. ఇదే సమయంలో పౌర ఫిర్యాదులను స్వీకరించడంతో పాటు పరిష్కారానికి సంబంధించిన సమాచారం తెలపాలని, ఇతర సేవలు సత్వరం అందేలా చర్యలు చేపట్టాలని సూచించింది.

సచిన్ ఆడిన నేల.. అధ్వానంగా

◆ కనీస వసతులకూ నోచని స్టేడియం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: కడప డీఎస్ఏ మైదానం.. క్రికెట్ గాడ్‌గా కీర్తి గడించిన సచిన్ తెందూల్కర్, ఇండియన్ క్రికెట్ వాల్‌గా పేరొందిన రాహుల్ ద్రావిడ్‌లతో పాటు అనేక మంది నాటితరం క్రికెటర్లు ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఈ స్టేడియంలోనే ఆడారు. అటువంటి స్టేడియానికి నిర్వహణ లోపాలు ఇప్పుడు శాపంగా మారుతున్నాయి. డీఎస్‌డీవోలు మారుతున్నారే తప్ప.. స్టేడియం అభివృద్ధికి ఎవరూ పాటుపడడం లేదు. కనీసం మౌలిక వసతులు కల్పించాలనే విషయాన్నీ విస్మరిస్తున్నారు. దీంతో ఆడుకునేందుకు ఇక్కడికి వచ్చే క్రీడాకారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.



వర్షం వస్తే బురదమయంగా మారుతున్న డీఎస్ఏ మైదానం

వానొస్తే నాలుగైదు రోజులు మూతే

స్టేడియంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. గంట పాటు వర్షం పడిందంటే చాలు నాలుగైదు రోజులు మూసివేస్తారు. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మైదానంలో పలుచోట్ల పిచ్చిమొక్కలు పెరిగాయి. విష పురుగులు సంచరిస్తున్నాయి.

మరుగుకూ లేదు చోటు

హాకీ, వాలీబాల్, తైక్వాండో, హ్యాండ్‌బాల్, క్రికెట్, కబడ్డీ, టెన్నిస్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడల సాధనకు నిత్యం వందల మంది క్రీడాకారులు స్టేడియానికి వస్తుంటారు. ఎస్‌జీఎఫ్, అసోసియేషన్ జిల్లా స్థాయి ఎంపికలప్పుడు పెద్దసంఖ్యలో విద్యార్థులు, క్రీడాకారులు విచ్చేస్తుంటారు. బాలికలు, మహిళలు క్రీడా దుస్తులు ధరించేందుకు ప్రత్యేక గది కూడా ఇక్కడ లేదు. తాగేందుకు మంచినీరూ ఉండదు. ఇక మరుగుదొడ్ల నిర్వహణ దుర్భరంగా మారింది.

భవనానికీ లేవు మరమ్మతులు

దశాబ్దాల చరిత్ర కలిగిన డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియం శిథిలావస్థకు చేరింది. పలుచోట్ల పగుళ్లు కనిపిస్తున్నాయి. అయినా మరమ్మతులకూ నోచుకోడం లేదు. శిక్షకులు, క్రీడాకారుల కోసం కొన్ని గదులను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో పాటు మైదానంలో అథ్లెటిక్ ట్రాక్‌ను నిర్మించాల్సి ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని స్టేడియంలోని సమస్యలకు పరిష్కారం చూపుతూ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించాల్సి ఉంది.



అలరించిన ఆట పాట

పులివెందుల, మారుతీనగర్(కడప), న్యూస్‌టుడే: పులివెందుల, కడపలోని శిల్పారామాల్లో ఆదివారం సందడి నెలకొంది. సెలవు రోజున సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు, కళాకారులు ప్రదర్శించిన నృత్యాలను వీక్షించారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు



గత 33 సం॥లుగా సహకార మరియు గ్రామీణాభివృద్ధి శాఖలలో వివిధ హోదాల్లో క్రమశిక్షణ మరియు అంకితభావంతో పనిచేసి 31.08.2026వ తేదీన పదవీ విరమణ చేయుచున్న మా తండ్రి గారైన శ్రీ పి.సూర్యప్రకాశ్‌రావు గారికి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.

కుమారుడు : Dr P.T.సందీప్‌రాజ్, MBBS., D.Ortho, Civil Assistant Surgeon, Area Hospital, Palmaneru
కోడలు : Dr P.మెర్లిన్, MBBS., M.D., Pediatrician, CMC, Vellore
మనుమడు: Ethan Isaac
కుమార్తె : పి.చందన, B.Tech.,

శ్రీ పిచ్చినీళ్ల సూర్యప్రకాశ్‌రావు
B.Tech., Civil
Assistant Registrar (Co-operative)
Dist. Co-Op ఆఫీస్, కడప
Ex. APD, DWMA, Ex. MSO

శ్రీమతి కె.హెచ్.వినోదిని
Office. Supdt.,
గవర్నమెంట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కడప.

సిద్దవటంలో ప్రవక్త జ్ఞాపకం



మహ్మద్ ప్రవక్త వస్తు సామగ్రిని ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

సిద్దవటం, న్యూస్‌టుడే: ఇస్లాం మత గురువు మహ్మద్ ప్రవక్తకు చెందిన చారిత్రక వస్తు సామగ్రి సిద్దవటంలోని ఆస్తాన-ఏ-ఫతు మియా మసీదులో నేటికీ పదిలంగా ఉంది. ఈయన వంశీయులకు చెందిన పలువురి వస్తువులు కూడా భద్రంగా ఉన్నాయి. ఇటీవల సిద్దవటంలో మిలాద్ ఉన్ నబీ రోజున భక్తుల కోసం వీటిని ప్రదర్శనకు ఉంచారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించారు.

● **మట్లి కోటలో మసీదు నిర్మాణం:** సిద్దవటంలోని మట్లి రాజుల కోటకు పడమర వైపున మహ్మద్ ప్రవక్త వంశీయులైన 30వ తరానికి చెందిన సయ్యద్ బద్రే ఆలమ్ ఖాద్రి, ఆయన సోదరుడు సదర్-ఏ-ఆలమ్ ఖాద్రి ఆస్తాన-ఏ-ఫతు మియా 1658లో మసీదు నిర్మించారు. మిలాద్ ఉన్ నబీ రోజున ఇక్కడ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆరో శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు మహ్మద్ ప్రవక్త, ఆయన కుమార్తె బీబీ ఫాతిమా, అల్లుడు హజరత్ అలీ, మనవళ్లు హిమామ్‌హసన్, హుస్సేన్, మరికొందరి వస్తువులను అప్పట్లో ఆయన వంశీయులు సేకరించి ఇక్కడి మసీదులో భద్రపరిచారు.

శతాబ్దాలుగా వస్తువులు భద్రం

మహ్మద్ ప్రవక్తకు సంబంధించి తలపాగా, నల్ల కంబలిలోని కొంతభాగం, భుజం మీద కప్పుకొనే ఉత్తరీయాలు, తలవెంట్రుక, ప్రార్థన చేసేందుకు కింద పరుచుకునే సుజిని తివాచీ వస్త్రం, సమాధికి కప్పే గలీఫ్ వస్త్రం ఇక్కడ కనిపిస్తాయి. మహ్మద్ ప్రవక్త కుమార్తెకు చెందిన దుప్పటి, మహ్మద్ పల్లా, అల్లునికి చెందిన జుబ్బా, తలపాగా, జామీన్(వివాహానికి కట్టేవి), మనవళ్ల వస్తు సామగ్రి దర్శనమిస్తాయి. అరేబియాలోని కర్బలా యుద్ధ సమయం నాటి పరిస్థితులను తెలుపుతూ తన సోదరుడు మహ్మద్ అనీఫ్‌కు రాసిన లేఖ, ప్రవక్త వంశీయుడైన మహబూబ్ సుభాని వస్తు విశేషాలు కూడా ఇక్కడ భద్రంగా ఉన్నాయి. వీటిని సిద్దవటంలోని ఆస్తాన-ఏ-ఫత్తుమియా మసీదు భవనంలో శతాబ్దాలుగా పదిలపరిచి తరతరాలుగా మహ్మద్ ప్రవక్త వంశీకులు కాపాడుతున్నారు. ఏడాదికి రెండుసార్లు వచ్చే మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల్లో ప్రదర్శనకు ఉంచుతారు. వీటిని తిలకించడానికి జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, చెన్నై నుంచి భక్తులు వస్తుంటారు.



మాధవరాయస్వామి దేవాలయం ప్రాంగణంలో చిత్రీకరించిన ఓ సన్నివేశం

వెండితెరపై గండికోట

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: సుమంత్ కథానాయకుడిగా తెరకెక్కిన 'మహేంద్రగిరి వారాహి' సినిమాను జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో చిత్రీకరించారు. యువ దర్శకుడు సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను గండికోటలోని మాధవరాయస్వామి దేవాలయం, ప్రాంగణంలో తెరకెక్కించారు. ఇందుకు సంబంధించిన ట్రైలర్ ఇటీవల విడుదలైంది. ఇందులో కథానాయకుడు ఆలయంలోకి వెళ్లడంతో పాటు మరిన్ని దృశ్యాలు కనిపిస్తుండటంపై ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి మహిమలు, పురాతన క్షేత్రం, రహస్యాల చుట్టూ సాగే ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదలకు సిద్ధంగా ఉంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

అసిస్టెంట్ సేల్స్‌మెన్ కావలెను

ప్రముఖ దినపత్రికకు చందాదారులను చేర్పించడానికి చురుకైన, చొరవ కలిగిన యువతి, యువకులు కావలెను.

అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణత
వయస్సు: 19-30 సంవత్సరాల లోపు
తెలుగులో వ్రాయడం, చదవడం వచ్చి ఉండాలి

జీతం: 15,611/- + టీ.ఎ. + డీ.ఎ. 130/- ఇవ్వబడును
(ESI, PF సౌకర్యం కలదు)

ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సోమవారం 31.08.2026వ తేదీన ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల మధ్య స్వయంగా సంప్రదించండి.

CIEL HR inspired by science
C/o ఈనాడు ఆఫీస్
సర్వే నెంబరు-16, ఆలంఖాన్‌పల్లె, కడప.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9177111468, 8008346592.

(c) eenadu

సెప్టెంబరులో రాష్ట్ర మహాసభలు


మాట్లాడుతున్న పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలో సెప్టెంబరు 24, 25 తేదీల్లో పీఆర్ఎస్‌వైఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని రాష్ట్ర కన్వీనర్ శంకర్ తెలిపారు. స్థానిక పీఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ, నిరుద్యోగ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి విడాలన్నారు. రాయలసీమలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ సమస్యను పరిష్కారం చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి ఆ హామీని అమలుచేయకుండా గాలికొదిలేశారన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్, ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో చదివే విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రబాబు, వెంకటరమణ, రఘునాథ్, హరికృష్ణరెడ్డి, సాయినాథ్‌రెడ్డి

క్రీడాకారులకు ప్రోత్సాహకం


క్రీడా ప్రోత్సాహాన్ని అందుకున్న రాజంపేట బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట ప్రభుత్వ క్రీడా మైదానంలో బాల్‌బ్యాడ్మింటన్ సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన నలుగురు క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకాన్ని అందజేసింది. తిరుపతిలో శనివారం జరిగిన క్రీడా దినోత్సవ కార్యక్రమంలో రాజంపేట బాల్‌బ్యాడ్మింటన్ సీనియర్ విభాగంలో ఎస్.బావుద్దీన్ (రూ.70 వేలు), ఎస్.సోనియా (రూ.50 వేలు), జూనియర్ విభాగంలో ఎస్.మహమ్మద్ ముస్తాక్ (రూ.31 వేలు), సబ్ జూనియర్ విభాగంలో కె.కౌసిక్ (రూ.12,500) నగదు అందుకున్నారు. ఈ మేరకు వీరిని విశ్రాంత హెచ్ఎం శంకరయ్య, విశ్రాంత పీడీ షామీర్‌బాషా, బాల్‌బ్యాడ్మింటన్ కోచ్ బాబాఫకృద్దీన్ అభినందించారు.

హరిత వనాలుగా.. విద్యాలయాలు


కేజీబీవీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బడుల్లో పచ్చదనం పెంపునకు అనంత అరణ్య

పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జీవన మనుగడకు ప్రమాదకరమైన కార్బన్ గ్యాస్ ఎమెల్షన్ శాతాన్ని నెట్ జీరో చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా విద్యాలయాల్లో చెట్ల పెంపకానికి అనంత అరణ్య పేరుతో నడుం బిగించింది. ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన గురుకుల పాఠశాలలు, వసతిగృహాల్లో అధికారులు వివిధ రకాల మొక్కలు నాటడంతో పాటు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

● **ఆరోగ్యకర వాతావరణమే లక్ష్యంగా:** జిల్లాలోని 39 మండలాల పరిధిలో ఉన్న 55 కస్తూర్బా, గురుకుల, మైనార్టీ, గిరిజన పాఠశాలలు, ఎస్సీ ఎస్టీ బీసీ వసతి గృహాల్లో నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన విద్యాలయాలు, వసతిగృహాల్లో పచ్చదనం పెంపునకు సానుకూలమైన పరిస్థితులు ఉన్నాయా లేవా అని అధికారులు పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో ఒక్కొక్క పాఠశాల, వసతిగృహంలో 25 సెంట్ల స్థలంలో పండ్లు, కలప, దోమలు నివారించే మొక్కలు, తదితర 1625 మొక్కలు నాటి సంరక్షిస్తారు. ● అలాగే సూర్యకిరణాల ద్వారా సోలార్ ప్యానల్ నుంచి విద్యుత్తును వాడుకోవడంపై చర్యలు చేపట్టనున్నారు. వీటితో బడుల నుంచి వృథా అయ్యే నీరును.. సహజంగా ఫిల్టర్ ఏర్పాటు చేసి సంపులో నిల్వ చేస్తారు. అనంతరం ఈ నీటిని మొక్కలకు సాగునీరుగా వినియోగించడంతో పాటు కనీస అవసరాలకు వాడుకునేలా చేస్తారు. తడి, పొడి చెత్తను కాల్చకుండా వాటి నుంచి వర్మీ కంపోస్టు తయారు చేయనున్నారు. ఈ రకమైన అంశాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తారు. పచ్చదనం పెంపు చేయాలనే ఆలోచనను వారిలో ప్రేరేపిస్తారు. ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని పలు పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.

చర్యలు చేపట్టాం

పచ్చదనం పెంపు విజయం చేసేందుకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు పీఎంశ్రీ పాఠశాలల్లో కూడా తగు చర్యలు తీసుకుంటున్నాం.

- కృష్ణారెడ్డి, నెట్ జీరో హెల్తీ క్యాంపస్ ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్

ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతీస్తే ఊరుకోం


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి

రాజంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయాలని చూస్తే ఊరుకోమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి హెచ్చరికలు చేశారు. ఆదివారం రాజంపేటలోని ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచి ఇప్పుడు శ్వేతపత్రాల పేరుతో దగా చేయాలని చూస్తే ఉద్యమానికి సిద్ధపడతామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి పక్కన పెట్టడం ప్రజాస్వామి విలువలకు విరుద్ధమన్నారు. మా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయాలని చూస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇంత వరకు సీపీఎస్‌పై స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు అశోక్‌కుమార్, జయరామయ్య, కె.సురేష్, వై.సుబ్రహ్మణ్యంరాజు, ఓబులేశు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, మోహన్‌రావు, నరసింహ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్‌యువర్ సీఎండీ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: వినియోగదారుల విద్యుత్తు సమస్యలు పరిష్కరించేందుకు తన కార్యాలయంలో నేడు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి 12.30 వరకు నిర్వహించే కార్యక్రమానికి వినియోగదారులు 89777 16661 నంబరుకు ఫోన్ చేసుకోవచ్చన్నారు.

● **జిల్లా స్థాయిలో..:** జిల్లా స్థాయిలో ఎస్ఈ శ్రీనివాసులు తన కార్యాలయంలో డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 వరకు నిర్వహిస్తారని, వినియోగదారులు 08562-242457కు ఫోన్ చేయొచ్చన్నారు.

పుణ్యక్షేత్రంలో తిరునాల మహోత్సవం



అలంకరణలో మరియతల్లి.. దివ్యబలి పూజలో పాల్గొన్న విశ్వాసులు

నాగరాజుపేట, న్యూస్‌టుడే: లోకంలోని సకల మానవాళికి మరియమ్మ తల్లి అని సీఆర్ఐ యూనిట్ విచారణ గురువులు ఫాదర్ బ్రిట్టో అన్నారు. స్థానిక ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ఉత్సవాల్లో రెండో రోజైన ఆదివారం ఆయన దివ్యబలి పూజను సమర్పించగా రెవ ఫాదర్ వర చిన్నప్ప సందేశాన్ని అందించారు. ఈ పుణ్యక్షేత్రంలోని అమ్మ సన్నిధి సంతానం దయచేసేదిగా రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా చెప్పుకొంటారని, అంతటి మహిమ కల్గిన తల్లి మన కడపలో ఉండటం అందరి అదృష్టమని అన్నారు. పూజ ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో ఊరేగింపు చేశారు. విశ్వాసులు ఆరోగ్యమాత నామాన్ని జపిస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఆరోగ్యస్వామి, ఇతర గురువులు, కన్యస్త్రీలు, తిరునాల కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు విశ్వాసులు పాల్గొన్నారు.

దేవుని మార్గంలో నడిచినప్పుడే సార్థకత


మాట్లాడుతున్న మేత్రాసనం వీజీ ఫాదర్ ప్రసాద్‌రావు

రాజంపేట, న్యూస్‌టుడే: దేవుని మార్గంలో నడిచినప్పుడే ప్రతి వ్యక్తి జీవితానికి సార్థకత ఉంటుందని కడప మేత్రాసనం వీజీ ఫాదర్ ప్రసాద్‌రావు, కడప డీన్ ఫాదర్ ఎ.జోసెఫ్‌రాజు తెలిపారు. స్థానిక ఇన్‌ఫాంట్ జీసెస్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలయేసు దివ్య మందిరాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఏర్పడిన పుటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ రోమన్ క్యాథలిక్ ప్రార్థన మందిరం లేదని, ఇప్పుడు ఏర్పాటు చేసి నూతన విచారణ గురువుగా పాస్టర్ జోసెఫ్ లారెన్స్‌ను నియమించినట్లు తెలిపారు. ఇక్కడే త్వరలో బాలయేసు దేవాలయ నిర్మాణం చేపడతామన్నారు. ఇనుమును తుప్పు నాశనం చేసినట్లే పగ, కోపం, అసూయ, ద్వేషం, మోసం మనిషిని పతనం చేస్తుందన్నారు. సాటి మనిషిపై ప్రేమ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫాదర్ టి.రమేష్, జోసెఫ్ లారెన్స్, ఇన్‌ఫాంట్ జీసెస్ హెచ్ఎం ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన స్వాగత నృత్యం ఆకట్టుకుంది.

3న చలో విజయవాడ


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యాహక్కుచట్టం - 2009 సెక్షన్ (23)1 సవరణకు కృషిచేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 3వ తేదీన చలోవిజయవాడ చేపట్టామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ నియామకాలకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)ను తప్పనిసరి చేస్తూ కేంద్రప్రభుత్వం 2010లో విద్యాహక్కు-చట్టాన్ని రూపొందించిందన్నారు. దీంతో 2010కి ముందు ఉద్యోగ నియామకం పొందిన ఉపాధ్యాయులు టెట్ పరిధిలోకి వచ్చారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షమంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం నుంచి తొలగించాలనే తీర్పు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనలకు గురిచేస్తోందన్నారు. స్పెషల్ టెట్‌లో అర్హత మార్కులను తగ్గించాలని, ఆఫ్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులకు సంబంధిత సబ్జెక్టులోనే పరీక్షలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాదనవిజయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, నాయకులు రవికుమార్, సుజాతరాణి, రమణ, శ్రీనివాసులు, గోపీనాథ్, ఏజాస్‌అహ్మద్, దేవదత్తం, ప్రభాకర్, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Raja Rajeswari & Sivalayam Temple
Dorasanipalle(V), Proddatur (M), Y.S.R Kadapa District
e-Procurement Tender
NIT.No.P/COE/1571/2026-6, Dt: 24-07-2026
e-Tenders are invited through the e-Procurement portal for **Reconstruction of Temple**. Interested bidders may visit the official website **www.apeprocurement.gov.in** for detailed information, eligibility criteria and submission guidelines.
Trustee

న్యాయం చేయాలని కోరుతూ.. మృతుల బంధువుల ఆందోళన


ఎస్పీ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నిస్తున్న ఆందోళనకారులు



పవన్‌కుమార్‌రెడ్డి జస్వంత్‌కుమార్‌రెడ్డి (పాత చిత్రాలు)

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప శివారులోని సింగ్‌పూర్ టౌన్‌షిప్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్‌రెడ్డి(21), జస్వంత్‌కుమార్‌రెడ్డి(22)లు మృతి చెందారు. ప్రకాశం జిల్లా ఉమ్మడివరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి నగరంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివేవారు. జస్వంత్‌కుమార్‌రెడ్డి హోమియోపతి కళాశాలలో ఆయుర్వేద వైద్యవృత్తినభ్యసించేవారు. వీరిద్దరూ ఊటుకూరు నుంచి నగరవనానికి ద్విచక్రవాహనంలో వెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదీ ట్రాఫిక్ పోలీసుల సమాచారం. అయితే తమ కుమారుడి మృతిపై ట్రాఫిక్ సీఐ రెండు వైపులా మాట్లాడుతున్నారని, రోడ్డు ప్రమాదం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోలేదంటూ మృతుల తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, ఉమా, హనుమంతురెడ్డి, కళావతి ఆరోపించారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద మృతదేహాలతో ఆదివారం వారు ఆందోళన చేశారు. ఎస్పీ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఘటనా స్థలానికి ఇన్‌ఛార్జి డీఎస్పీ బాలస్వామిరెడ్డి, ఒకటో పట్టణ సీఐ తిమ్మారెడ్డి, ఎస్సైలు ప్రదీప్‌కుమార్, అమర్‌నాథ్‌రెడ్డి వచ్చి బాధితులతో మాట్లాడారు. అక్కడ నుంచి ఆందోళనకారులు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. రెండు రోజుల్లో విచారించి న్యాయం చేస్తామని చెప్పడంతో మృతదేహాలను తీసుకెళ్లారు. ట్రాఫిక్ సీఐ తులసీరామ్ ప్రమాదం చేసిన వారికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

● **రెండు కుటుంబాల్లో విషాదం:** మరో ఆరుమాసాల్లో ఇరువురి విద్య పూర్తి అవుతుంది. ఇంతలో ఇద్దరూ మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పవన్‌కుమార్‌రెడ్డి ఒక్కడే కొడుకు. తన సోదరి అఖిలారెడ్డి లండన్‌లో చదువుతోంది. రెండు నెలల కిందటే పవన్‌కుమార్‌రెడ్డికి అఖిలారెడ్డి రూ.2.20లక్షలు వెచ్చించి ద్విచక్రవాహనం కొనిచ్చి ఆమె లండన్‌కు వెళ్లారు. వెళ్లిన కొద్ది నెలలకు ఇలా జరగడంతో అఖిలారెడ్డి కన్నీరుమున్నీరుగా విలపించారు. జస్వంత్‌కుమార్‌రెడ్డి తండ్రి హనుమంతరెడ్డి హైదరాబాదులో హోమియోపతి ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. చేతికొచ్చిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మహమ్మద్ అస్రార్(20) ఓ మటన్ దుకాణంలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి బంధువు ముజాహిద్‌తో కలిసి ఆయన పొట్టేళ్ల కొనుగోలుకు ద్విచక్రవాహనంపై మైదుకూరుకు బయలుదేరారు. ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వెళ్లగానే నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న వ్యక్తులను.. వీరి బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో మహమ్మద్ అస్రార్ తీవ్ర గాయాలై మృతి చెందారు. బైక్ నడుపుతున్న ముజాహిద్, రోడ్డుదాటుతున్న వ్యక్తులకు గాయాలయ్యాయి. ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప రైల్వేస్టేషన్ పరిధిలో రాయచోటి వంతెన సమీపంలోని రైలు పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 60 ఏళ్లు ఉంటాయి. నీలం రంగు కాలర్ టీ షర్ట్, తెలుపు రంగు గడులు ఉన్నాయి. నీలం రంగు లుంగీ ధరించాడు. మెడలో మట్టి రంగు కలిగిన తాయత్తు ఉంది.ఎలాంటి ఆధారాల్లేవు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

318 మందిపై కేసు నమోదు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్క వాహనదారుడు విధిగా శిరస్త్రాణం ధరించాలని పోలీసులు తెలిపారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 318 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి, రూ.72,995 జరిమానా విధించామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలన్నారు. చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు.

బస్‌షెల్టర్‌లో మృతదేహం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట బస్‌షెల్టర్‌లో గుర్తుతెలియని మృతదేహం (45) ఉన్నట్లు ఆదివారం పోలీసులు గుర్తించారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బస్‌షెల్టర్ ప్రాంగణంలో అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి పరిశీలన చేయగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. శవాన్ని పంచాయతీ సిబ్బందికి అప్పగించడంతో చెరువులో ఖననం చేశారు.

బీసీ రక్షణ చట్టం అమలుకు డిమాండ్


మాట్లాడుతున్న బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు తిప్పరెడ్డిపల్లె నాగేశ్వరరావు

కడప విద్య, న్యూస్‌టుడే: బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను పరిరక్షించేందుకు బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు తిప్పిరెడ్డిపల్లె నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా నేటికీ బీసీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయడంలో జాప్యం తగదన్నారు. బీసీ యువతకు స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబులు, కేశవులు, మధుసూధన ఆచారి, లంబోదరా, ఓబులేసుయాదవ్, గంగులయ్య, మధుప్రసాద్, వంశీ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజమంత్ర పునశ్చరణ పూజలు


కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

సిద్దవటం, న్యూస్‌టుడే: శ్రీశైల దేవస్థానానికి దత్తత కోవెలైన సిద్దవటంలోని శ్రీకామాక్షి సమేత సిద్ధవటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రెండో రోజు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో అర్చకులు, వేదపండితులు వేదపారాయణలు నవగ్రహ జపములు, శివ పంచాక్షరి, కలశ పూజలు, ధ్వజమంత్ర పునశ్చరణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో విశేష పూజలు చేశారు. పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలన్నారు.

టెట్ మినహాయింపు కోరుతూ 2న ధర్నా


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని.. స్పెషల్ టెట్ నోటిఫికేషన్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న మంగళగిరిలోని విద్యాభవన్ వద్ద ధర్నా చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నిరసన జరుగుతుందని ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ప్రొద్దుటూరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సయ్యద్‌బాషా, కృష్ణారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, బాబులరెడ్డి, అమీన్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : నీట్ పీజీ పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కడప, ప్రొద్దుటూరు, చాపాడు, రాజంపేటకు చెందిన పలు కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. కడపలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, కేఓఆర్ఎం, కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం కేంద్రాల్లో... ప్రొద్దుటూరులో సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో... చాపాడులో చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో... రాజంపేటలో అన్నమాచార్య యూనివర్సిటీలో పరీక్షను నిర్వహించారు. మొత్తం 7 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1,176 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

అమరావతి ఛాంపియన్‌షిప్‌లో కడప క్రీడాకారుల సత్తా


హాకీ అండర్-23 మహిళా విభాగంలో రెండవ స్థానం సాధించిన కడప జట్టు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : తిరుపతిలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కడప క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన అండర్-17, 23 వయసు విభాగాలకు చెందిన బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించారు. శాప్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, ఆర్చరీ, హాకీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కబడ్డీ, యోగా, చదరంగం, వాలీబాల్ విభాగాల్లో... మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. మొదటి స్థానంలో నిలిచిన క్రీడాకారుడికి/ జట్టుకు లక్ష రూపాయలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు నగదు అవార్డులను అందించారు. మొత్తంపై రాష్ట్రవ్యాప్తంగా 8,826 మంది బాలబాలికలు పోటీపడగా... జిల్లా నుంచి 375 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించారు.

● **సత్తా చాటిన కడప:** ● **అండర్-17 విభాగం (ప్రథమ స్థానం):** కందుల వెంకట కృష్ణమోహన్‌రెడ్డి (లాంగ్‌జంప్), దీపికారెడ్డి (హైజంప్), కిరణ్‌కుమార్‌రెడ్డి (వెయిట్‌లిఫ్టింగ్ - 85 కేజీల విభాగం), సిరిచందన (వెయిట్‌లిఫ్టింగ్ - 45 కేజీల విభాగం), వెలాంగిణీ వేద (వెయిట్‌లిఫ్టింగ్ - 53 కేజీల విభాగం), గీతారాణి (వెయిట్‌లిఫ్టింగ్ - 69 కేజీల విభాగం). ● **అండర్-17 విభాగం (ద్వితీయ స్థానం)** : హాసిని (800 మీటర్ల పరుగు), తనూష్ తేజ (100 మీటర్ల పరుగు) ● **అండర్-23 విభాగం (ప్రథమ స్థానం) :** కడప బాలుర జట్టు (కబడ్డీ), దీపిక-అనూరాధ (యోగా అర్టిస్టిక్ పెయిర్), దీపిక, అనురాధ, జయ నాగసుధ, బాల తనూజ, జస్మిత తనూజ (యోగాసన గ్రూప్).

● **అండర్-23 విభాగం (ద్వితీయ స్థానం):** భరత్‌కుమార్‌రెడ్డి (ఆర్చరీ కాంపౌండ్), అర్షద్ (వెయిట్‌లిఫ్టింగ్ - 70 కేజీల విభాగం), భానుతేజ (వెయిట్‌లిఫ్టింగ్ - 85 కేజీల విభాగం), రవి శంకర్ (వెయిట్‌లిఫ్టింగ్ - 95 కేజీల విభాగం), కడప బాలికల జట్టు (హాకీ), రెడ్డిరియాజ్-జశ్వంత్ (యోగా అర్టిస్టిక్ పెయిర్)

మొక్కలే కదా అని పీకేశారా!

కడప నగరంలోని మహావీర్ కూడలి నుంచి కలెక్టరేట్, ఆర్ట్స్ కళాశాల మీదుగా రిమ్స్‌కు వెళ్లే మార్గంలో కాలిబాటపై భారీ కుండలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. పదుల సంఖ్యలో ఏర్పాటు చేసిన వీటిల్లో ఎక్కడా ఒక్క మొక్క కూడా కనిపించడం లేదు. దీంతో ఆహ్లాదం కరవవుతోంది. అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నగరపాలక(కడప)



మన్నూరు.. ఇంకా అన్నమయ్య పేరు!



అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న రాజంపేట నియోజకవర్గాన్ని ఈ ఏడాది జనవరి 1 నుంచి వైఎస్సార్ కడప జిల్లాలోకి విలీనం చేశారు. ఆ రోజు నుంచే అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న జిల్లా పేరును అధికారులు మార్చారు. ఇది గడిచి సుమారు 8 నెలలు పూర్తి కావస్తోంది. అయితే మన్నూరు పోలీస్ స్టేషన్ అధికారులు మాత్రం అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికీ స్టేషన్‌పై బోర్డుపై అన్నమయ్య జిల్లా పేరును అలానే ఉంచారు. కొత్తగా పట్టణానికి వచ్చిన ప్రజలు దీన్ని చూసి మన్నూరు పోలీసు స్టేషన్ అన్నమయ్య జిల్లా పరిధిలో ఉందని పొరపడుతున్నారు. ఈ విషయాన్ని మన్నూరు సీఐ లింగప్పను వివరణ కోరగా గతంలో ఏర్పాటు చేసిన బోర్డునే కొనసాగిస్తున్నామని, దాన్ని మారుస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణం**

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్‌డీవో షేక్ గౌస్‌బాషా, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఛైర్మన్ నవీన్‌కుమార్ అన్నారు. కడప డీఎస్ఏ స్టేడియంలో ఆదివారం జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా కోటాను 3 శాతానికి పెంచిందన్నారు. జాతీయస్థాయిలో క్రీడల్లో సత్తా చాటితే క్రీడా కోటా కింద ఉద్యోగాలు పొందవచ్చన్నారు. శ్రేయస్ వెల్‌నెస్ ప్రతినిధులు గిరిబాబు, ప్రశాంతి, జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి రేవంత్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.


విజేతలుగా నిలిచిన బాలికలతో డీఎస్‌డీవో గౌస్‌బాషా, నిర్వాహకులు

● **విజేతలు వీరే..!:** సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. సబ్ జూనియర్ విభాగంలో జస్మిత ప్రథమ, షేక్ దిల్షా ద్వితీయ, చరిత-మోక్షితలు తృతీయ స్థానంలో నిలిచారు. జూనియర్ విభాగంలో వినీల ప్రథమ, లాస్య ద్వితీయ, శాన్విత-నిఖితలు తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే సీనియర్ విభాగంలో గ్రిహిత మొదటి, మోక్ష రెండో, రుచిత-యశస్వినీ మూడో స్థానంలో నిలిచినట్లు అసోసియేషన్ కార్యదర్శి రేవంత్ తెలిపారు. వారికి మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

అడవిలో ప్లాస్టిక్ కవర్లు వేస్తే చర్యలు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం రేంజీ అడవుల్లో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వేస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని సిద్దవటం బాధ్య అటవీక్షేత్రాధికారి నయీమ్‌అలీ హెచ్చరికలు చేశారు. ఆదివారం సిద్దవటంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని శ్రీనిత్యపూజస్వామి కోవెలలో, అట్లూరు పరిధిలోని గోపాలస్వామి కొండ కోవెలలో శ్రావణ మాసం పూజలు జరుగుతున్నాయన్నారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారని, వారు వెంట తెచ్చుకున్న కవర్లను అడవిలో వేస్తున్నారని, వాటి వల్ల వన్యప్రాణులకు ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్లను నివారించడంలో ఆలయాల నిర్వాహకులు కూడా అటవీ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

EENADU e Classifieds

JOBS

Medical Equipment Company requires Sales Executive, Service Engineer. ITI / Diploma. Kadapa. ✆ 9110310246

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

DRIVERS

ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో కడప నందు పనిచేయుటకు అనుభవజ్ఞులు అయిన లైసెన్స్ కలిగిన డ్రైవర్లు కడప నుండి కర్నూలు, కడప నుండి అనంతపురం రూట్‌లకు వాణిజ్య వాహనాలు (LCV) నడుపుటకు మరియు డెలివరీ చేసి POD తీసుకుని రికార్డు చేయుటకు కావలెను. Con: 9849158539.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ. 330/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

రాజంపేట

•రాజంపేట •బద్వేలు

ఎల్‌నినో ప్రభావం.. ఈసురోమంటున్న ఉద్యానం



మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వుతున్న కూలీలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు పంటల సాగుపైనే కాదు.. ఉద్యాన పంటల పైనా ప్రభావం చూపుతున్నాయి. వీబీ జీ రామ్‌జీ పథకంలో 2026-27 సంవత్సరానికి సుండుపల్లి మండలంలో 300 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు చేయాలని లక్ష్యం నిర్దేశించారు. అయితే ప్రతికూల పరిస్థితులు ఉండటంతో రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడంలేదు. దరఖాస్తు చేసుకున్న వారు కూడా మొక్కలు నాటేందుకు గుంతలు తీయలేదు. వారిలో చాలా మంది వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

12 ఎకరాల్లోనే మొక్కలు నాటారు..

సుండుపల్లి మండలంలో ఇప్పటి వరకు 53 మంది రైతులకు సంబంధించిన 97 ఎకరాలలో తోటల పెంపకానికి అనుమతులు వచ్చాయి. రెండో విడతలో 13 మంది రైతులకు చెందిన 24.11 ఎకరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఏపీవో మాలిక్‌బాషా తెలిపారు. ఇప్పటి వరకు 57 ఎకరాలలో మొక్కలు నాటించడానికి కూలీలు గుంతలు తవ్వారు. అందులో 12 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే మొక్కలు నాటారు.

వరుణుడి కోసం ఎదురుచూపు

గుంతలు తవ్విన వారు, ఇంకా తవ్వాల్సిన వారు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వరుణుడు కరుణిస్తే తప్ప వారు మొక్కలు నాటే పరిస్థితి కనిపించడం లేదు. కరవు పరిస్థితులు కళ్లముందు కదలాడుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో కరవు భయంతో మొక్కలు నాటేందుకు రైతులు వెనుకా ముందు ఆలోచిస్తున్నారు. మంచి వర్షాలు వస్తే దరఖాస్తు చేసుకున్న రైతులంతా సాగుకు సిద్ధమవుతారని లేనిచో ఈయేడు సాగు చేయక పోవచ్చేనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సిద్దవటంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సిద్దవటం ఎస్‌ఐ హారిక కౌన్సెలింగ్ ఇచ్చారు. పలు అంశాలపై సలహాలు, మార్గదర్శకం, హితబోధ చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. గొడవలు సృష్టిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరికలు చేశారు.

సంపద సృష్టి.. లేదు దృష్టి!

నిరుపయోగంగా కేంద్రాలు | గ్రామాల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం

సుండుపల్లి, వీరబల్లి, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల ఉద్దేశం నెరవేరడం లేదు. ఫలితంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి వీరబల్లి, సుండుపల్లి మండలాల్లో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర, డ్రైడే కార్యక్రమాలు ఏ మాత్రం ఆచరణ కావడం లేదు. ఇంటింటి చెత్త సేకరణ చేపట్టేలా గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన చెత్త బుట్టలు ప్రజలకు పంపిణీ చేయకుండా వీరబల్లి గోదాములోనే ఉంచడం నిర్లక్ష్యానికి నిదర్శనం.



వీరబల్లిలో చెత్తసేకరణ కేంద్రం లేక బయట పడవేసిన చెత్త

నీరుగారిన ఎరువుల తయారీ లక్ష్యం

గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి.. సేంద్రియ ఎరువులు తయారు చేసి తక్కువ ధరకు రైతులకు విక్రయించి తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలన్నది ఈ కేంద్రాల ఉద్దేశం. అది ఏ మండలంలోనూ జరగడం లేదు. వీరబల్లి మండలంలో 12 పంచాయతీలుండగా 11 కేంద్రాలను నిర్మించారు. వీరబల్లిలో నక్కల గుట్ట వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం మూడేళ్ల కిందట అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. కేవలం ఏర్పాటు చేసిన సిమెంటు తొట్లు మిగిలాయి. మండల కేంద్రంలో సేకరించిన చెత్తను క్లాప్‌మిత్ర చెరువుల్లో, నదిలో వేసి కాలుస్తున్నారు. ఇటీవల చెత్త సంపద సృష్టించాలని వీరబల్లి మండలంలో మట్లి గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేశారు. కానీ అది అమలు కాలేదు.

● సుండుపల్లి మండలంలో 14 పంచాయతీలుండగా 14 చెత్త సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో ఎక్కడా ఎరువులు తయారు చేయడం లేదు. మండల కేంద్రంలో చెత్తను సేకరిస్తున్నారే తప్ప మిగిలిన పంచాయతీల్లో తూతూ మంత్రంగా ఈ చెత్త సేకరణ జరుగుతోంది.

మందుబాబులకు అడ్డాగా...

చెత్త సంపద కేంద్రాలు కంపచెట్లకు నిలయంగా.. మందుబాబులకు అడ్డాగా మారాయి. చెత్త తరలించేందుకు రిక్షాలను సమకూర్చారు. చెత్త సేకరణకు తాత్కాలిక పద్ధతిలో పంచాయతీకి 5 మంది క్లాప్‌మిత్రలను నియమించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో ఎక్కడా సంపద సృష్టి జరగడం లేదు. దీంతో ఈ కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కొన్ని చోట్ల తొట్లు పగిలిపోయాయి. రెండు మండలాల్లో మండల కేంద్రాల్లో చెత్త సేకరించడం తప్ప సంపద సృష్టించిన దాఖలాలు లేవు.

చర్యలు తీసుకుంటాం...

ఆ కేంద్రాలను వినియోగంలోకి తీసుకోవడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. అవసరమైన నిధులు మంజూరు చేశాం. నీరు, విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. మండలానికి ఒక చెత్త సేకరణ కేంద్రాన్ని మోడల్‌గా ఎంపిక చేసుకుని అన్ని వసతులు కల్పించాం. త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చి సంపద సృష్టించేలా చర్యలు తీసుకుంటాం.

- గౌస్‌బాషా, సుధకార్‌రెడ్డి, వీరబల్లి, సుండుపల్లి, ఎంపీడీవోలు

స్పందించారు.. పరిష్కరించారు

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నుపల్లె ప్రధాన రోడ్డులో కాలువల్లో తీసి పక్కన వేసిన పూడికను అధికారులు ఎట్టకేలకు తొలగించారు. ఈ నెల 20న 'తీసిన పూడిక.. తిరిగి కాలువల్లోకి' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో మహబూబ్‌బీ, డిప్యూటీ ఎంపీడీవో మురళీమోహన్ స్పందించి పూడికను అక్కడ్నుంచి తరలించారు.



☛ కలసపాడులో వర్షం కురిసినప్పుడు ఏర్పడుతున్న సమస్యపై ఈ నెల 10న 'వర్షం కురిస్తే.. రోడ్లన్నీ నీటిమడుగులే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆక్రమణలు తొలగించి.. కాలువలోని పూడిక తీశారు. దుకాణాదారుల తీరుతో తీసిన పూడిక కాలువపైనే ఉంచారు. పూడిక కాలువలో పడుతుండటంపై ఈ నెల 20న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో పూడిక తొలగించి తరలించారు.

☛ మండలంలోని చెన్నారెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో అధికారులు తాత్కాలిక మురుగు కాలువ ఏర్పాటు చేయించారు. ఈ నెల 30న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు ఎంపీడీవో మహబూబ్‌బీ స్పందించారు. రహదారిపై మురుగు పారకుండా రహదారిని ఆనుకొని తాత్కాలిక కాలువ ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించారు.

గోపవరం: మండలంలోని పీపీ కుంటలో చేతి పంపునకు మరమ్మతులు చేయని వైనంపై ఈ నెల 29న 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో హసీనా చేతి పంపునకు మరమ్మతులు చేయించారు.

కృష్ణమ్మ రాకతో కరవు నేలకు మహర్దశ



మాట్లాడుతున్న తెదేపా నేత సూర్యనారాయణరెడ్డి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: కృష్ణమ్మ రాకతో బద్వేలు నియోజకవర్గంలోని కరవునేల మహర్దశ వస్తోందని బద్వేలు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 'వెలిగొండ జలాలు - బద్వేలు నియోజకవర్గ భూములకు కొత్త సిరులు' కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ర్యాలీ చేశారు. సోమవారం సీఎం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించనుండటంతో సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ, డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో చంద్రమోహన్ ప్రారంభించారు. అనంతరం కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పశ్చిమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అన్నారు. సీఎం సంకల్పంతో నెరవేరిందన్నారు. ఈ జలాలతో ఈప్రాంత రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ సుప్రజ, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అడగ లేక.. అడుసులో అడుగేయక తప్పక



రాజంపేట మండలం కూచివారిపల్లి గ్రామ పంచాయతీ డీబీఎన్‌పల్లిలోని ప్రధాన సీసీరోడ్డుపై నలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు మార్గంలేదు. దీంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో అడుసు తొక్కే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. నీరు నిల్వ ఉండటంతో దోమలు ఉద్ధృతి పెరగడంతో వ్యాధుల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు అడుగుల దూరంలో కాలువ ఉంది. చిన్నపాటి పనులు చేసి అనుసంధానం చేస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఈ సమస్యను కూచివారిపల్లి పంచాయతీ కార్యదర్శి కమలాదేవి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ**

గుంత తవ్వారు.. వదిలేశారు..!



రాజంపేటలో చౌడేశ్వరీదేవి ఆలయం నుంచి గాంధీ విగ్రహానికి వెళ్లే మార్గంలో వారం రోజుల కిందట తాగునీటి పైపు లైన్ మరమ్మతుల కోసం గుంత తీశారు. కానీ ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. దీని కారణంగా రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పితే గుంతలో పడే ప్రమాదముంది. పురపాలక అధికారులు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను పురపాలక నీటి విభాగం అధికారి నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా త్వరగా మరమ్మతులు చేయించి ఎవరికీ ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, రాజంపేట**

మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పరామర్శ

కలసపాడు: మండలంలోని రెడ్డిపల్లెలో ఆదివారం స్థానిక తెదేపా నాయకుడు ఆదినారాయణ తల్లి చిన్నపోలమ్మను ఆదివారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పరామర్శించారు. చిన్నపోలమ్మ ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చికిత్స చేయించుకొని గ్రామానికి వచ్చారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే రెడ్డిపల్లెకు వెళ్లి పరామర్శించి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆమె వెంట మండల తెదేపా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు పీరయ్య, నాయకులు పట్టాభిరెడ్డి, వెంకటరెడ్డి, ఓబులేశు, రసూల్, బాషా తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో అగ్ని ప్రమాదం

బద్వేలు : స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులోని లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వెనుక ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు పాత టైర్లకు నిప్పు పెట్టడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. కార్యాలయ సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో పాత టైర్లు మాత్రమే అగ్నిప్రమాదానికి గురయ్యాయని ఎటువంటి నష్టం లేదని సిబ్బంది తెలిపారు.

చర్చిని సందర్శించిన కార్మికశాఖ అధికారిణి



సూపరింటెండెంట్ జ్యోతికుమారిని సన్మానిస్తున్న చర్చి గురువులు ఆశిష్‌గాబ్రియేల్, జాన్సన్ విజయ్‌కుమార్ తదితరులు

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడులోని పురాతన సీఎస్‌ఐ చర్చిని ఆదివారం సాయంత్రం విజయవాడలోని ఏపీ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ జ్యోతికుమారి సందర్శించారు. ఈ సందర్భంగా చర్చిలో ఆమె భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ప్రెస్బిటర్ ఆశిష్ గాబ్రియేల్, రెవరెండ్ జాన్సన్ విజయకుమార్, కమిటీ బృందం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు కిశోర్, పి.సైమన్, రత్నరాజు, ఉపాధ్యాయుడు కె.జె.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల ముంగిట కనపడదా మురుగు!



రాజంపేట నూనెవారిపల్లి మార్గంలోని వినాయకనగర్‌లో ఇంటి ముంగిట మురుగు పారుతోంది. చాలా రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో రోడ్డంతా పాచి పట్టింది. ఈ వీధిలోకి పురపాలక శానిటరీ సిబ్బంది, అధికారులు వెళ్లడంలేదు. మురుగు పాచి పట్టడంతో దోమల సమస్య తీవ్రంగా ఉందని, విషజ్వరాలతో బాధపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పురపాలక శానిటరీ అధికారి రాము దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సిబ్బందిని పంపించి మురుగును తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, రాజంపేట**

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రోడ్డు నిర్మాణం ప్రారంభంలో జనసేన పార్టీ నాయకులు యల్లటూరి శ్రీనివాసరాజు, తదితరులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ పార్లమెంటు బాధ్యుడు యల్లటూరి శ్రీనివాసరాజు తెలిపారు. రాజంపేట మన్నూరులో రూ.25 లక్షల డీఎంఎఫ్ నిధులతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక సదుపాయాలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ఇప్పటికే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు వంటి సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వీరబల్లి, న్యూస్‌టుడే: ఇసుక అధిక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు టైరు ఊడిపోవడంతో ఆగి పోయి ప్రమాదం తప్పింది. ఆదివారం వీరబల్లి మాండవ్య నది నుంచి అధిక లోడుతో రాయచోటికి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ సోమవరం వడ్డెపల్లె వద్దకు రాగానే టైరు ఊడి పడిపోవడంతో కొంత దూరం వెళ్లి ఆగిపోయింది. ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.

అశ్రునయనాలతో వీడ్కోలు

కాశినాయన, న్యూస్‌టుడే: వైద్యురాలు యశ్విత ఆకస్మిక మృతితో మండలంలోని సావిశెట్టిపల్లె వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. పైచదువులు చదవాలన్న కుమార్తె ఆశలకు తల్లిదండ్రులు అండగా నిలిచి ఎంబీబీఎస్ పీజీ ప్రవేశ పరీక్ష రాసేందుకు శిక్షణ నిమిత్తం హైదరాబాద్‌కు పంపారు. పరీక్ష ఆదివారం రాయాల్సి ఉండగా శనివారమే యశ్విత మానసిక ఒత్తిడి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మృతి చెందడంతో తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. 'మాకు గొప్ప పేరు ప్రఖ్యాతలు తెస్తావు అనుకున్నాం తల్లీ.. అప్పుడే మానుండి దూరమయ్యావా..' అంటూ తల్లిదండ్రులు రామ్మోహన్‌రెడ్డి, కుమారి చేసిన ఆర్తనాదాలు చూపరులను కన్నీరు పెట్టించాయి. వందలాదిగా తరలి వచ్చిన బంధువుల మధ్య ఆదివారం ఉదయం యశ్విత అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, విశ్వనాథరెడ్డి పరామర్శించి సంతాపం తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజంపేట	: 94418 72651
బద్వేలు గ్రామీణ	: 80085 73493
గోపవరం	: 83740 76144
ఒంటిమిట్ట	: 70367 00101

?: గోపవరం ఎస్టీ కాలనీకి నీరందించే బోరు పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. **- రాజు, గోపవరం**

✓: పైపు లైన్‌కు మరమ్మతులు చేయిస్తాం. **- హసీనా, డిప్యూటీ ఎంపీడీవో**

?: బ్రాహ్మణపల్లెలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు పారక పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. **- శ్రీనివాసులు, బ్రాహ్మణపల్లె**

✓: పారిశుద్ధ్య కార్మికులచే కాలువలు శుభ్రం చేయిస్తాం. **- మోషే, పంచాయతీ కార్యదర్శి**

?: లక్కవారిపల్లెలో వీధి కుళాయిలకు బిరడాలు లేక నీరు వృథాగా పోతోంది. **- సుబ్బరాయుడు, లక్కవారిపల్లె**

✓: కుళాయిలకు కొత్త బిరడాలు బిగించి నీటి వృథాను అరికడతాం. **- వీరశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి** **- న్యూస్‌టుడే, గోపవరం**

?: సుండుపల్లి మండలంలోని సాయన్నగారిపల్లి రామాలయ వీధిలో రామాలయం వద్ద రెండు నెలలుగా వీధి దీపం వెలగడంలేదు. మరమ్మతుకు చర్యలు తీసుకోవాలి. **- వరదరాజ, సాయన్నగారిపల్లి**

?: సుండుపల్లి ఆనందనగర్‌లోని రెండు వీధుల్లో రెండు నెలలకు పైగా వీధి దీపాలు వెలగడం లేదు. **- డి.భగీరథరెడ్డి, సుండుపల్లి**

?: సుండుపల్లి ప్రధాన రహదారి కొత్తమసీదు సమీపంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు రెండు నెలలుగా వెలగక ఇబ్బందిగా ఉంది. **- రెడ్డిబాషా, సుండుపల్లి**

✓: వీధి దీపాల మరమ్మతుకు గుత్తేదారు రావాల్సి ఉంది. చాలా సార్లు చెప్పినా ఆయన స్పందించలేదు. ప్రత్యేక అధికారి ద్వారా మరో సారి ప్రయత్నించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. **- కృష్ణయ్య, పంచాయతీ అభివృద్ధి అధికారి, సుండుపల్లి**

- న్యూస్‌టుడే, సుండుపల్లి

?: రాజంపేట మండలం పెద్దకారంపల్లి పంచాయతీ వద్ద విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదరకంగా ఉన్నాయి. **- చెంగల్రాయుడు, పెద్దకారంపల్లి**

?: ఊటుకూరులో ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్తు స్తంభం కిందపడేలా ఉంది. నూతన విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయాలి. **- కుమార్‌రాజు, ఊటుకూరు**

✓: వెంటనే లైన్‌మెన్‌కు చెప్పి ఒరిగిన విద్యుత్తు స్తంభాలను సరి చేయిస్తాం. రెండ్రోజుల్లో ఊటుకూరులో పాత స్తంభం తొలగించి కొత్తది ఏర్పాటు చేయిస్తాం. **(పై రెండు సమస్యలకు విద్యుత్తు శాఖ రాజంపేట ఏఈ ఈశ్వర్‌రాజు సమాధానమిచ్చారు)**

?: అప్పారాజుపేట పశువైద్యశాల వద్ద చేతి పంపు పని చేయడం లేదు. **- నరేశ్, అప్పారాజుపేట**

✓: ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి చేతి పంపునకు మరమ్మతులు చేయిస్తాం. **- వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి**

?: మండలంలోని బాలరాజుపల్లిలో ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. **- బ్రహ్మేంద్రరాజు, బాలరాజుపల్లి**

✓: దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- వరప్రసాద్, ఎంపీడీవో, రాజంపేట**

?: హత్యరాలలో కుళాయిలు లేవు. నడక దారిన వచ్చే భక్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. **- కృష్ణ, రాజంపేట**

✓: రెండ్రోజుల్లో కుళాయిలు ఏర్పాటు చేయిస్తాం. **- వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి, అప్పారాజుపేట**

?: రాజంపేట - తిరుపతి ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వీధీ దీపాలు వెలగడం లేదు. **- నాగరాజు, రాజంపేట**

✓: దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- నాగేంద్ర, మున్సిపల్ ఎలక్ట్రికల్ ఏఈ**

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

వేంకటేశా.. నిను సేవించేదెలా!



వేంకటేశ్వర స్వామి ఆలయం

పురోహితులు లేక భక్తులకు ఇబ్బందులు

పట్టని దేవాదాయ శాఖ అధికారులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు మండలంలోని లక్ష్మీపాళెం శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి 600 ఏళ్ల చరిత్ర ఉంది. నియోజకవర్గంలోనే ప్రముఖ ఆలయంగా ప్రసిద్ధి చెందడంతో భక్తులు అధికంగా వస్తున్నారు. దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఈ కోవెలలో గతంలో ముగ్గురు పురోహితులు ఉండేవారు. అయితే మూడేళ్లుగా ప్రధాన అర్చకులు ఒకరే ఉన్నారు. ఇక్కడ శ్రీవారి మూలవిరాట్ తోపాటు అమ్మవార్ల ఉప ఆలయాలు వేర్వేరుగా ఉన్నాయి. పండగ పర్వదినాల్లో స్వామి, అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆ సమయంలో ప్రధాన అర్చకులు శ్రీవారికి అభిషేకం చేస్తుండటంతో వచ్చిన భక్తులు అర్చన, ప్రత్యేక పూజలు చేయించకుండానే వెనుదిరిగే పరిస్థితులున్నాయి. పూజలు చేసేందుకు మరో పురోహితుడు లేకపోవడంతో భక్తులు దండం పెట్టుకుని వెళ్లిపోతున్నారు. ప్రతి పండగకు గ్రామంలో స్వామి ఉత్సవం జరుగుతుంది. ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఒక పూజారి మాత్రమే ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయంలో మరో ఇద్దరు పురోహితులను నియమించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీని వివరణ కోరగా లక్ష్మీపాళెం శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి అదనంగా పురోహితులను త్వరలోనే నియమించి భక్తులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.

నాగిరెడ్డిపల్లెలో ఇంటింటికీ తెదేపా



కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని నాగిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి యానాది, నాయకులు శ్రీనివాసులు, ఎంపీ రావు, నాగభూషణం, ప్రవీణ్, రమేష్, సంజు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని.. ఒకరికి తీవ్రగాయాలు

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని నేకనాపురం - బెటాలియన్ మార్గంలో ఉన్న అయ్యప్పస్వామి గుడి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు వెంకటసుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. బద్వేలులోని సుందరయ్య కాలనీకి చెందిన అతను రాజంపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నేకనాపురం సమీపంలోని అయ్యప్పగుడి సమీప రహదారి వద్దకు రాగానే ఎదురుగా కారు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారునికి కాలు తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం 108 వాహనంలో కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

రాపూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడికి గాయాలైన ఘటన నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని రాపూరు - చిట్వేలి ఘాట్ రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. రాజంపేటకు చెందిన బి.చతుర్వేదేశ్వర్ ద్విచక్ర వాహనంపై రాపూరు మీదుగా తిరుపతికి వెళ్తుండగా ఘాట్ రోడ్డు 11-12వ కి.మీ. మధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. 108 సిబ్బంది నెల్లూరు ఆసుపత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో ముగిసిన సంప్రోక్షణ పూజలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామం నందానాయక బిడికి (చిన్నబిడికి)లోని శ్రీరాంబాలాజి ఆలయంలో ఆలయ సంప్రోక్షణ పూజలు ఆదివారం ముగిశాయి. రాతి ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనా పూజలు, మహాకుంభాభిషేకం, శివలింగ స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ హోమం వంటి పూజలు పురోహితులు నిర్వహించారు. ప్రథమ హారతి అనంతరం మహాద్వార దర్శనం కల్పించారు. భక్తులకు మూడు రోజులపాటు నిర్వాహకులు అన్నవితరణ చేశారు. సాయంత్రం మహాభోగ్ కార్యక్రమం నిర్వహించారు.

అలంకరణలో వేంకటేశ్వరస్వామి →



గంగమ్మకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

వీరబల్లి: వర్షం కురవాలని కోరుతూ వీరబల్లి గంగమ్మ అమ్మవారికి ఆదివారం ఉదయం 101 బిందె నీటితో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేసి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వర్షం కురవాలని రేణుకా ఎల్లమాంబకు మొక్కులు

సిద్దవటం: వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ఆదివారం సిద్దవటం మండలం మాచుపల్లె పరిధిలోని శాంతినగర్ ఎస్సీ కాలనీకి చెందిన మునిస్వామి స్థానిక రేణుకా ఎల్లమాంబ గుడిలో పూజలు చేసి 101 టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సుబ్బరాజు మాట్లాడుతూ వర్షాలు కురవాలని అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృత అభిషేకం, తదితర పూజలు చేసినట్లు తెలిపారు.



మాచుపల్లె ఎల్లమాంబ గుడిలో టెంకాయలు కొడుతున్న భక్తులు

చీరల పంపిణీ

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గడికోటలోని చిన్ననాగిరెడ్డిగారిపల్లిలో చిన్ననాగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనవళ్లు నాగూర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డిలు ఆదివారం పేదలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై చీరలు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చప్పిడి మహేష్‌నాయుడు, రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి, నందలూరు ఎంపీటీసీ సభ్యుడు పెంచలయ్య, నాయకులు రమేష్‌గౌడ్, వెంకటేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

20వ వర్ధంతి



అనురాగం, ప్రేమ, ఆప్యాయతలతో అందరినీ పలుకరిస్తూ.. మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మీరు మా నుండి దూరమై నేటికి 20 సం॥లు కావస్తున్నా మీ స్మృతులు మాలో సదా పదిలం. మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...

కీ॥శే॥ సగబాల కొండన్న
APSEB., (E.R.O) UDC.,
విద్యుత్‌నగర్, రాజంపేట.

భార్య : నాగమణి
Rtd. Nursing Suptd.

కుమారులు :
ఎస్.భావనారాయణ M.Com., LL.B., ADVOCATE
ఎస్.ఎన్.ఎస్.ప్రసాద్ Software Engineer

కుమార్తెలు - అల్లుళ్ళు, మనుమలు- మనుమరాండ్రు మరియు బంధుమిత్రులు

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

నిండుగా జలం... ఆనందంలో జనం


వద్దిరాల వద్ద జీఎన్ఎస్ఎస్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

మైలవరం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గాలేరి నగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా గండికోట ప్రాజెక్టుకు 3000 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అవుకు నుంచి గండికోట వరకు 52 కి.మీ పొడవు మేర ఉన్న కాలువలో కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేరు గొప్ప.. చెత్త దిబ్బ

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: జిల్లాలో రెండో అతిపెద్ద పట్టణంగా ప్రొద్దుటూరు ప్రసిద్ధి చెందింది. ఇంత ప్రాధాన్యం కలిగిన పట్టణంలో మురుగుపారుదల అస్తవ్యస్తంగా మారింది. దాంతో ప్రధాన మురుగు కాలువలైన మడూరు, కొత్తపల్లె, దొరసానిపల్లె, ప్రొద్దుటూరు-1, ప్రొద్దుటూరు-2 కాలువలు పూడికతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పిచ్చిమొక్కలు, కంపచెట్లు దట్టంగా పెరిగి మురుగు సాఫీగా వెళ్లేందుకు వీలు లేకుండా ఉంటోంది. ఫలితంగా దోమలు, దుర్వాసన విజృంభిస్తోంది. కాలువల మరమ్మతులు, పూడికతీత పనులకు ఏటా పురపాలక సంఘం లక్షలు కేటాయిస్తోంది. అయినా పట్టణ ప్రజలకు సరైన వసతులు సమకూరడం లేదు. పన్నుల రూపంలో కోట్ల రూపాయలు వసూలవుతున్నా ప్రజారోగ్యానికి భద్రత లేకుండా పోతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులైన చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.


పిచ్చి మొక్కలతో అధ్వానంగా మురుగు కాలువ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

ప్రొద్దుటూరు: 9966349431
జమ్మలమడుగు: 9494294241
మైదుకూరు: 8008573447

?: ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి గేటు ముందు పలువురు అధిక సంఖ్యలో ఆటోలు నిలుపుతున్నారు. దీంతో అత్యవసర వాహనాలు లోపలికి వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతోంది. - రమేష్, ప్రొద్దుటూరు

✓: భద్రతా సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. ఆటోలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. - ఆనంద్‌బాబు, సూపరింటెండెంట్ - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం

స్పందించారు.. పరిష్కరించారు

● చాపాడు మండలం చియ్యపాడురోడ్డు వద్ద మైదుకూరు - ప్రొద్దుటూరు రహదారిపై ప్రమాదకరంగా ఉన్న ప్రకటన బోర్డును అధికారులు తొలగించారు. 'ఒరిగిన బోర్డు.. చోదకులకు గుబులు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

● పెద్దముడియం మండలంలోని జె.కొట్టాలపల్లె పొలాల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయంటూ ఈ నెల 29న 'ఒరిగిన స్తంభాలు.. కూలితే ప్రమాదమే' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు ఏఈ రామకృష్ణ ఆదివారం తమ సిబ్బందితో చర్యలు చేపట్టారు. - న్యూస్‌టుడే, పెద్దముడియం

ఆ ఊళ్లకు వెళ్లాల్సిన బస్సు ఎప్పుడొస్తుందో తెలియదు


జమ్మలమడుగు - తాడిపత్రి బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా.. ఆర్టీసీ సర్వీసులు మాత్రం ఆ కారులు పెంచడం లేదు. దీంతో ఉన్న బస్సులు సరిపోక.. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో జమ్మలమడుగు నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే గంటల తరబడి బస్టాండ్‌లో నిరీక్షించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమ, శని, ఆదివారాల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉందని.. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అరకొర బస్సులతో ప్రయాణికుల ఇక్కట్లు

జమ్మలమడుగు డిపో పరిధిలో సొంత, అద్దె(హైర్) కలిపి మొత్తం 74 బస్సులున్నాయి. రోజూ 39 మార్గాల్లో.. సుమారు 30 వేల కి.మీ ప్రయాణిస్తూ ఆర్టీసీకి రూ.16 లక్షల వరకు ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లల్లో స్త్రీశక్తి పథకం అమలవుతోంది. పథకం అమలు అనంతరం ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) 70 నుంచి 112కు పెరిగింది. బస్సుల్లో ప్రయాణికులు నిల్చునేందుకు స్థలం కూడా ఉండడం లేదు. స్త్రీశక్తి అమలులోకి వచ్చి ఏడాది అవుతున్నా బస్సుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. దీంతో జమ్మలమడుగు నుంచి తాడిపత్రి, ఆళ్లగడ్డ, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో సీట్లు దొరకడం గగనమవుతోంది. ఉచిత సర్వీసుల్లో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి ఉండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పండగ రోజుల్లో, సెలవుదినాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రద్దీ సమయాల్లోనూ అదనపు సర్వీసులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించే పరిస్థితులు నెలకొన్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలతో ప్రయాణాలు చేయడానికి మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రస్తుతం బస్సులు కొరత ఉండడంతో అదనపు బస్సు సర్వీసులు నడపలేకున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వీసులు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. - సుబ్బమ్మ, డిపో మేనేజర్, జమ్మలమడుగు

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

మైలవరం: మండల పరిధిలోని ధన్నవాడలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామిని భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది.


అభయాంజనేయ స్వామి


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో భక్తులు

● పోలేరమ్మకు ప్రత్యేక పూజలు..

బ్రహ్మంగారిమఠం: స్థానిక పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు ప్రసాద్ ఆచారి అమ్మవారిని అలంకరించి.. భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, బోనాలు సమర్పించారు.

● భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు

ప్రొద్దుటూరు పట్టణం: పట్టణంలోని వసంతపేట వీధిలో ఉన్న పాతరాఘవేంద్రస్వామి దేవాలయంలో గురురాజసేవా సంఘం ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలు నిర్వహించారు. బృందావనాన్ని పూలతో అలంకరించి పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు.

ఉత్సాహభరితంగా బండ లాగుడు ప్రదర్శన

పెద్దముడియం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాలూరులో లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆదివారం ఎద్దుల బండ లాగుడు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను తెలుగు యువత మండల అధ్యక్షుడు సుధీర్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. పండగ వాతావరణంలో జరిగిన ఈ పోటీలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, యువత భారీ సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం 16 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రతిభ కనబరిచిన ఎడ్లకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

ఆదమరిస్తే.. బావిలోకే!

కొండాపురం - సింహాద్రిపురం మార్గంలోని లావనూరు సమీపంలో.. ప్రధాన రహదారి పక్కనే ఉన్న బావి ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. బావికి ప్రహరీ లేకపోవడంతో వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రక్షణగోడ నిర్మించాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొండాపురం



నిరుపయోగం.. తాగునీటి పథకం



కొండాపురంలోని కిట్టయ్యస్వామి గుడి సమీపంలో నిర్మించిన నీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. దాదాపు ఆరేళ్ల కిందట ట్యాంకు నిర్మాణం చేపట్టారు. చిత్రావతి నది నుంచి పైపులైన్ ద్వారా ట్యాంకుకు కూటమి ప్రభుత్వం నీటివసతి కల్పించింది. అయితే ట్యాంకు నుంచి కాలనీలకు పైపులైన్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కొండాపురం

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, చిత్రంలో నాయకులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్‌లో పేర్కొన్న హామీలను పూర్తిగా అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డకు ఆర్థిక సాయం, 50 ఏళ్లు దాటిన బీసీలకు సామాజిక పింఛన్లు ఎప్పటిలోగా అమల్లోకి తీసుకువస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు పిల్లల తల్లిదండ్రులు నిరీక్షిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు నజీర్, జిలానిబాషా, ఖాజాపీర్, లాజం గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు


దస్త్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో శిరీష

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని.. వారి పేరు తప్పకుండా ఓటరు జాబితాలో ఉండాలని ఆర్డీవో శిరీష అన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆమె ఆదివారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేశారు. బీఎల్‌వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సర్ ప్రక్రియ ఎలా జరుగుతోంది, డిజిటైజేషన్, ఓటరు నమోదు తదితరాలపై ఆరా తీశారు. 327 పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ఫారం-6లు 62, ఫారం-8లు 63 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ వివేకానందరెడ్డి, ఆర్ఐ న్యాయం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి రాష్ట్ర మహా సభలు

బిల్టప్ (కడప): సెప్టెంబరు 1,2,3, తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్న డీవైఎఫ్ఐ 16వ రాష్ట్రమహా సభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు చిన్ని, కార్యదర్శి శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం గోడ పత్రాలు ఆవిష్కరించారు.

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న సీఐ కొండారెడ్డి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రొద్దుటూరు ఒకటో పట్టణ ఠాణా సీఐ కొండారెడ్డి అన్నారు. స్థానిక ఈశ్వర్‌రెడ్డినగర్‌లో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని. . పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గండి క్షేత్రానికి అదనపు బస్సులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: శ్రావణ మాసంలో గండి క్షేత్రానికి భక్తులు ఎక్కువగా వెళ్తుంటారు. ఈ మేరకు ప్రొద్దుటూరు నుంచి ఎనిమిది అదనపు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం గంగాధర్ ఆదివారం తెలిపారు. మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎర్రగుంట్లలో ఆర్టీసీ కార్గో ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఖాళీ చూపరు.. నియామకం చేపట్టరు

చాపాడు మండలం వి.రాజుపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టు ఖాళీ అయి ఏడాది అవుతున్నా అధికారులు నియామకం చేపట్టలేదు. అప్పటి నుంచి సహాయకురాలే అన్ని విధులు నిర్వర్తిస్తున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులుండగా ఇది వరకు అంగన్‌వాడీ కేంద్రాన్ని అక్కడే ఓ గదిలో నిర్వహించేవారు. ఇటీవల అద్దె భవనంలోకి మార్చారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. సీడీపీవో ముంతాజ్‌బేగం మాట్లాడుతూ.. త్వరలో కార్యకర్త నియామకం పూర్తి చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, చాపాడు



రోడ్డు ప్రమాదంలో గాయాలు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న లారీని.. వెనుక ఉన్న కారు ఢీకొనడంతో అందులో ఉన్న దంపతులు గాయపడిన ఘటన ప్రొద్దుటూరు - జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మైలవరం మండలం దన్నవాడకు చెందిన దంపతులు పనినిమిత్తం.. విజయవాడకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మార్గం మధ్యలో ముందు లారీ అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుక వస్తున్న వీరి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతులు ఇద్దరూ గాయపడ్డారు.

అదుపు తప్పి కాలువలోకి జరిగిన బస్సు

దువ్వూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పక్కన కాలువలోకి ఆర్టీసీ బస్సు వాలిన ఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. చోదకుని సమయ స్ఫూర్తితో ప్రమాదం తప్పింది. స్థానిక కల్యాణ మండపాల సమీపంలో పలువురు రహదారిపై బాణసంచా కాల్చుతున్నారు. ఇది గమనించని ఓ ద్విచక్రవాహనదారుడు అకస్మాత్తుగా ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు వ్యతిరేక దిశలోకి వెళ్లారు. ఈ క్రమంలో ఎదురుగా ఆళ్లగడ్డ వైపు వెళుతున్న బస్సు డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టకుండా సమయ స్ఫూర్తితో రహదారి పక్కకు బస్సును తిప్పారు. దీంతో పక్కన ఉన్న డ్రైనేజీ కాలువలోకి బస్సు వాలింది. ప్రయాణికులు ఎలాంటి ప్రమాదానికి గురి కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదకర ప్రయాణం ఆగేదెన్నడో?



మైదుకూరు-ప్రొద్దుటూరు రహదారిపై సరకు రవాణా వాహనాల్లో కూలీల తరలింపు. . అందులో అంచున కూర్చుని ప్రయాణించడం ఎంతో ప్రమాదకరం. ఏ మాత్రం అదుపుతప్పినా.. అకస్మాత్తుగా బ్రేకులు వేసినా కూలీలు కిందపడిపోయే అవకాశం ఉంది. వాహనదారులే కాదు గుత్తేదారు ప్రతినిధులు ఆలోచించాల్సి ఉంది. - న్యూస్‌టుడే, మైదుకూరు

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ చీకటివారిపల్లెలో ఆదివారం నూతన రామాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. తితిదే నిధులు రూ.40 లక్షలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.


భూమిపూజలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, స్థానికులు

తాగునీటి వృథా ఆపేదెవరు?

ఖాజీపేట మండల పరిధిలోని కొత్త నెల్లూరులో నిత్యం తాగు నీరు వృథా అవుతోంది. గ్రామంలోని కుళాయిలకే నేరుగా సరఫరా చేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో నీరు ఓవర్‌ఫ్లో అయ్యి గంటల తరబడి వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఖాజీపేట



సమరశంఖం జయప్రదానికి వినతి

కడప విద్య, న్యూస్‌టుడే : మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరికీ వెంటనే పాత పింఛన్ పునరుద్ధరణ చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకటజనార్దనరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన గుంటూరులో తలపెట్టిన సమరశంఖం సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున హాజరయి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఔషధ వ్యర్థం.. తొలగించకపోతే అనర్థం



బ్రహ్మంగారిమఠం మండల పరిధి వాంపల్లె చెరువు సమీపంలోని జాతీయ రహదారి 67 పక్కన గుర్తు తెలియని వ్యక్తులు అధిక సంఖ్యలో కాలం చెల్లిన ఔషధాలను కుప్పలుగా తెచ్చి పోస్తున్నారు. ఈ వ్యర్థాల నుంచి వెలువడే గాలిని పీల్చితే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పరిసరాల్లో పశువులు ఎక్కువగా తిరుగుతున్న దృష్ట్యా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బ్రహ్మంగారిమఠం

ప్రభుత్వం స్పందించే వరకూ పోరాడతాం


రిమ్స్ ఓపీ విభాగం వద్ద నిరసన తెలుపుతున్న పారా మెడికల్ సిబ్బంది

సర్వజన ఆసుపత్రి (కడప), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఏపీ మెడికల్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు తెలిపారు. స్థానిక రిమ్స్ ఓపీ విభాగంలో ఆదివారం రోజూ నల్ల బ్యాడ్జీలు ధరించి మానవహారం నిర్వహించి ప్రభుత్వం మా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేసి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారుల నిర్లక్ష్యం.. అభివృద్ధికి దూరం

మౌలిక వసతుల లేమితో ప్రజల ఇబ్బందులు

మైదుకూరు, న్యూస్‌టుడే: మైదుకూరు పురపాలక శాంతినగర్, జోసెఫ్‌పేట కాలనీ వాసులను సమస్యలు వెంటాడుతున్నాయి. కాలనీలు ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా.. కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల ముందు నాయకులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చడం లేదు. దీంతో పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. పారిశుద్ధ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఫలితంగా స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


జోసెఫ్‌పేటలో అధ్వానంగా మురుగు కాలువ

ఇదీ పరిస్థితి: శాంతినగర్, జోసెఫ్‌పేటలో దాదాపు 350 పైబడి ఇళ్లు ఉన్నాయి. శాంతినగర్‌లో పది వీధులు ఉండగా.. అయిందింటికి మాత్రమే సిమెంట్‌రోడ్లు ఉన్నాయి. వాటికి మురుగు కాలువలు నిర్మించలేదు. వర్షం వస్తే రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోరుమామిళ్ల రోడ్డు నుంచి శాంతినగర్ మీదుగా జోసెఫ్‌పేటకు వెళ్లే కేసీకాలువ కట్టపై ఆ ప్రాంతవాసులు రాకపోకలు చేస్తున్నారు. ఆ కట్టను కంప చెట్లు కప్పేశాయి. పెద్దగోతులు పడ్డాయి. జోసెఫ్‌పేట దిగువలో ఉండటంతో పరిసరాల నుంచి వచ్చే వర్షపునీరు కాలనీలో చేరుతోంది. మురుగు కాలువ అధ్వానంగా మారింది. అటు వర్షపునీరు ఇటు మురుగు బయటకు వెళ్లిపోయేలా కేసీకాలువ వెంట చాకిరేని వంక వరకు కాలువ తవ్వాలని స్థానికులు కోరుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు కాలనీలు అభివృద్ధి చేస్తామని వాగ్దానాలు చేశారు. అనంతరం మరిచిపోయారు. ప్రత్యేక అధికారి పాలనలోనైనా మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.


శాంతినగర్ వద్ద అభివృద్ధికి నోచుకోని కేసీకాలువ కట్ట

వైద్య కోర్సుల ఫీజుల పెంపు అన్యాయం

కడప విద్య, న్యూస్‌టుడే: వైద్య కోర్సుల ఫీజుల పెంపును వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. స్థానిక పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నాయకుల సమావేశం నిర్వహించారు. అంకన్న మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో వైద్య పట్టా, దంత వైద్య పట్టా కోర్సుల ఫీజులను 10 శాతం, వైద్య పీజీ కోర్సుల ఫీజులను 15 శాతం పెంచడం అన్యాయమన్నారు. ఇప్పటికే యాజమాన్య కోటా, విదేశీ భారతీయుల కోటా ఫీజులు భారీగా ఉన్నాయన్నారు. ఫీజుల నియంత్రణ కమిటీ పేరుతో తల్లిదండ్రులు, విద్యార్థులతో సమగ్ర చర్చ లేకుండా ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యారుణాలపై రాయితీలను పెంచాలని కోరారు.

అంబవరంలో పల్లెనిద్ర


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ నరేష్‌బాబు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజల చెంతకే పోలీస్ వ్యవస్థను తీసుకెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని అంబవరంలో ఆదివారం రాత్రి ఆయన పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి గ్రామస్థులతో సమావేశం అయ్యారు. భద్రతా పరిస్థితులను సమీక్షిస్తూ.. దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

అధిక లోడుతో ప్రయాణమెలా..?



రైతులు పంట తరలింపు, పశువుల మేత, పంట నూర్పిడి సమయాల్లో పరిమితికి మించిన లోడుతో వెళ్తూ అటుగా రాకపోకలు సాగించేవారిని ఆందోళనకు గురిచేస్తున్నారు. జమ్మలమడుగు - ముద్దనూరు ప్రధాన రహదారిలో ఓ ట్రాక్టర్‌లో అధిక లోడుతో ప్రయాణిస్తూ రోడ్డును సైతం ఆక్రమించి వాహనదారులను ఇబ్బందులకు గురిచేసింది. ఏమాత్రం విద్యుత్తు తీగలను తాకిన ప్రమాదం వాటిల్లేది. రైతులు ఎండుగడ్డి తరలింపులు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ఆర్టీసీ బస్సా.. పొగబండా!



జిల్లాలో ఆర్టీసీ బస్సులు కాలం చెల్లాయని చెప్పడానికి ఇంత కన్నా ప్రత్యక్ష ఉదాహరణ మరొకటి లేదు.. మైదుకూరు డిపోకు చెందిన ఏపీ04 జెడ్0232 నంబరు గల ఆర్టీసీ బస్సు గురువారం నగరంలో వెళ్తుండగా పొగ గొట్టం నుంచి విపరీతంగా నల్లటి పొగ వస్తోంది. బస్సు వెనకాల వెళ్తున్న వాహనదారులు పొగ తాకిడి తట్టుకోలేకపోయారు. ఆ బస్సు కొద్ది దూరం వెళ్లిన తరువాత వాహనదారులకు రోడ్డు కనిపించిందంటే పొగ ఏ స్థాయిలో వస్తోందో తెలుసుకోవచ్చు. ఆర్టీసీ అధికారులు స్పందించి పొగ రాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు. -ఈనాడు, కడప కడప (చిన్నచౌకు)

చూసుకో.. లేదంటే ఆసుపత్రికే!



కమలాపురం పట్టణంలో శివాలయానికి వెళ్లే దారి మధ్యలో డ్రైనేజీ కాలువపై ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. చోదకులు ఏ మాత్రం ఆదమరిచినా.. ప్రమాదం చోటుచేసుకునే ఆస్కారం ఉంది. రాత్రి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా కాలువ గుంతలోకి పడే అవకాశముంది. అధికారులు మాత్రం చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అక్కడ కనీసం హెచ్చరిక బోర్డు కూడా లేదు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కమలాపురం

సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం



మాట్లాడుతున్న నాగమునిరెడ్డి

కడప విద్య, న్యూస్‌టుడే: పిల్లల వికాసం, సృజనాత్మకను వెలికితీయడమే బాలోత్సవ లక్ష్యమని వక్తలు అన్నారు. స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం కడప బాలోత్సవం - 4 ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఒత్తిడి లేని చదువు మాత్రమే విద్యార్థులను సహజంగా ఎదిగేలా చేస్తుందన్నారు. నేర్చుకోవడమనేది ఒక సాధారణ అంశంలా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగమునిరెడ్డి, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరసుదర్శన్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రాహుల్, గోపాల్, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, కామేశ్వరమ్మ, నాగసురేష్, తిరుపాల్, సుబ్బరాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

వల్లూరు, న్యూస్‌టుడే: మత్తు జోలికి వెళ్లొద్దని, దాని వల్ల జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ సూర్యనారాయణరెడ్డి సూచించారు. వల్లూరులోని గ్రామదేవత అంకాళమ్మ ఆలయం ఆవరణలో వల్లూరు, సి.కొత్తపల్లె పరిసర గ్రామాలకు చెందిన యువకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మత్తుకు అలవాటు పడిన వారికి సమాజంలో గౌరవం దక్కదన్నారు. ఎక్కడైనా.. గంజాయి, తదితర మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మత్తు పదార్థాలను వినియోగించినా.. విక్రయించినా.. కఠిన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

శంకరాపురం.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

–న్యూస్‌టుడే, బిల్టప్ (కడప)



అంధుల పాఠశాల ఎదురు వీధిలో చెత్త, వ్యర్థాలు

కడప నగరంలోని శంకరాపురంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రహదారిలోని అంధుల పాఠశాల ఎదురుగా ఉన్న ప్రధాన రహదారికి ఆనుకుని చెత్తాచెదారం పెద్ద ఎత్తున పేరుకుపోయినా తొలగించేవారు కరవయ్యారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, ఎండిన కొమ్మలు ఒకచోట పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. చెత్త నుంచి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పక్కనే చెత్త పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చెత్త కుప్పల వద్ద ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో క్రమం తప్పకుండా చెత్త సేకరణ, పారిశుద్ధ పనులు చేపట్టాలని పలుసార్లు కోరినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని శంకరాపురం వాసులు కోరుతున్నారు.

వీధుల్లోనే చెత్తకుప్పలు దోమలు, ఈగలు విజృంభణ

అనారోగ్య సమస్యలు



వ్యర్థాలతో పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో స్థానికులకు తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. విషజ్వరాల భయంతో పిల్లలు, వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.
-లక్ష్మయ్య. స్థానికుడు

ఇళ్ల మధ్య చెత్త కుప్పలతో అవస్థలు



శంకరాపురంలోని భారతిబార్ సందులో నివాసాల మధ్య చెత్త కుప్పలు పేరుకుపోయాయి. చెత్త ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో కుళ్లిన దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు, పెరిగి పరిసరాల్లో నివసించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పురపాలక అధికారులు చెత్తను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి.
-సుబ్బారావు, శంకరాపురం

మెరుగైన పారిశుద్ధ్యం అందిస్తాం

శంకరాపురంలో చెత్త వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టి, పరిసరాలను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశిస్తాం. చెత్త నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపడతాం. ప్రజలు కూడా చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో వేయాలి. సమస్య పునరావృతం కాకుండా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం.
-రమేష్, ఎంహెచ్‌వో, నగరపాలక సంస్థ

ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో కీలకం



సైకిల్ తొక్కుతున్న ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, చిత్రంలో పోలీసులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం కోసం సైక్లింగ్ ఎంతో కీలకమని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏఆర్ పోలీసులు సైకిళ్లు తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని పురవీధుల్లో సైకిళ్లు తొక్కారు. ఈ సందర్భంగా ఏఆర్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామమన్నారు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడి తగ్గించడానికి మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందన్నారు. క్రమం తప్పకుండా సైక్లింగ్ తొక్కడం వల్ల బరువు కూడా తగ్గుతారన్నారు. రక్తపోటు, కొవ్వు పదార్థ సంబంధ సమస్యలను తగ్గిస్తుందన్నారు. పోలీసులు వారి దైనందిన జీవితంలో కొద్ది సమయాన్ని ఆరోగ్యం కోసం కేటాయించాలన్నారు. సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి కూడా ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఉద్యోగ విరమణ

కడప నగరపాలక, న్యూస్‌టుడే: స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ పి.రమాలక్ష్మి పట్నాయక్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఒక ఫంక్షన్ హాల్లో పలువురు సబ్ రిజిస్ట్రార్లు, స్టాంపు రైటర్లు ఆమెను సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

పెద్దచెప్పలిలో ఎల్లమ్మ తల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ తల్లి

కమలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన ఎల్లమ్మ తల్లికి శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌ను పలు రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అన్నదానం నిర్వహించారు. ఈ మాసంలో ప్రతి ఆదివారం భక్తుల సందడి ఉంటుందని ఆలయ నిర్వాహకుల తెలిపారు.

● ఘనంగా ముగిసిన భాగవతసప్తాహ కార్యక్రమం

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: వీరపునాయునిపల్లెలోని రామాలయంలో గత వారం రోజులుగా నిర్వహించిన భాగవత సప్తాహ కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిసింది. ఏడు రోజుల పాటు ఏడు మంత్రాలను మంత్రపుష్పం పేరిట నిర్వహించారు. అనంతరం ఓం నమో భగవతే వాసుదేవాయ మంత్రంతో ఆలయం చుట్టూ కలశప్రదర్శన గావిస్తూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో భాగవత సమాజ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి, నిర్వాహకులు సరోజమ్మ, రాధమ్మ, రాయలసీమ భాగవత భక్తసమాజం కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి, దర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



రామాలయం చుట్టూ కలశ ప్రదర్శన చేస్తున్న భక్తులు

ప్రభుత్వం స్పందించే వరకూ పోరాడతాం



రిమ్స్ ఓపీ విభాగం వద్ద నిరసన తెలుపుతున్న పారా మెడికల్ సిబ్బంది

సర్వజన ఆసుపత్రి (కడప), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఏపీ మెడికల్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు తెలిపారు. స్థానిక రిమ్స్ ఓపీ విభాగంలో ఆదివారం రోజూ నల్ల బ్యాడ్జీలు ధరించి మానవహారం నిర్వహించి ప్రభుత్వం మా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేసి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సంస్కృత సప్తాహ మహోత్సవం

మారుతీనగర్, న్యూస్‌టుడే: హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన శ్రీకోదండరామాలయంలో ఆదివారం సంస్కృత సప్తాహమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నయా మిషన్ జిల్లా అధ్యక్షుడు తురియానంద సరస్వతి స్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషతో పాటు సంస్కృత భాషకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత భాషకు విశేష సేవలందించిన పలువురు పండితులను సత్కరించారు. డాక్టర్ నాగేంద్రమ్మ, జిల్లా రచయితల సంఘం కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రంగాచార్యులు, శ్యామలనందప్రసాద్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.



పండితులను సత్కరిస్తున్న చిన్నయా మిషన్ జిల్లా అధ్యక్షుడు తురియానంద సరస్వతి స్వామి, డాక్టర్ పసుపులేటి శంకర్

మేమున్నాం.. మీకు తోడుగా..

కడప: 8008573428, 8074174832
పులివెందుల: 9381465490
కమలాపురం: 8008573475

?: పట్టణంలోని పడమర వీధిలో పాతాలసోమేశ్వర స్వామి ఆలయానికి సమీపంలో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. నడవాలంటేనే ఇబ్బందిగా ఉంది. - క్రిష్ణయ్య, స్థానికుడు

✓: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగేలా చర్యలు చేపడతాం. -మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, కమలాపురం

?: ముద్దనూరు - పులివెందుల ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రహదారికి అక్కడక్కడా మట్టి దిబ్బలు అడ్డుగా ఉన్నాయి. దీంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - శివమోహన్, చోదకుడు, మల్లేల

✓: వెంటనే చర్యలు చేపడతాం. అలాగే సూచిక పలకలు ఏర్పాటు చేయిస్తాం. - శివశంకర్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఏఈ - న్యూస్‌టుడే, తొండూరు

స్పందించారు.. పరిష్కరించారు

సింహాద్రిపురం: సింహాద్రిపురంలోని బుడ్డయ్యపాళెంలోని వీధిలో వీధి దీపాలు వెలగకపోవటం లేదని దీంతో ఇబ్బందులు పడుతున్నామని మేమున్నాం మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బలపనూరు నుంచి అంకాళమ్మగూడూరుకు వెళ్లేదారిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు.. పులివెందులకు చెందిన వీరయ్య పులివెందుల నుంచి సింహాద్రిపురానికి వస్తున్నారు. మార్గ మధ్యంలో ఆటోను తప్పించబోయి ఆయన ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో అక్కడే గుంత ఉండడంతో కింద పడి గాయపడ్డారు. తీవ్ర గాయాలు కాగా, స్థానికులు అతన్ని 108లో రిమ్స్‌కు తరలించారు.

వైకాపా నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం



సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి

చెన్నూరు: గతంలో కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం వైకాపా మండల సీనియర్ నాయకుడు పెడబల్లె గణేష్‌రెడ్డి అనారోగ్య సమస్యలతో శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి ఆదివారం చెన్నూరుకు వచ్చారు. ఈ మేరకు గణేష్‌రెడ్డి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు. ఆయన లేని లోటు బాధాకరమన్నారు.

సిద్దవటంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సిద్ధవటం, న్యూస్‌టుడే: సిద్దవటం పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సిద్దవటం ఎస్ఐ హారిక కౌన్సెలింగ్ ఇచ్చారు. పలు అంశాలపై సలహాలు, మార్గదర్శకం, హితబోధ చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. గొడవలు సృష్టిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరికలు చేశారు.

రైతుబజారులో కూరగాయల ధరలు



కడప వ్యవసాయం: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-40, క్యాబేజి-30, క్యారెట్-60, బీన్స్-80, బీట్‌రూట్-50, కీర-50, దోస-40, దొండకాయలు-45, ముల్లంగి-35, పాత అల్లం-160, కొత్త అల్లం-100, కాలీఫ్లవర్-35, క్యాప్సికం-60, టమాట-20, మిరపకాయలు 40, వంకాయలు-25, బెండకాయలు-20, బీర-30, కాకర-30, నాటు కాకర-35, మటిక్కాయ-25, చిక్కుడు-45, అలసందకాయలు-45, అనపకాయలు-50, ఉల్లిపాయలు-50.

కాంగ్రెస్‌తోనే నగర అభివృద్ధి సాధ్యం



తులసిరెడ్డితో మాట్లాడుతున్న గౌస్ పీర్, అంజన్ కుమార్

వేంపల్లె, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌తోనే కడప నగర అభివృద్ధి సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షుడు గౌస్ పీర్, ఉపాధ్యక్షుడు అంజన్ కుమార్ ఆదివారం వేంపల్లెలో తులసిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల విషయమై సూచనలు, సలహాలు తీసుకున్నారు. తులసిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే కడప మున్సిపాలిటీ మున్సిపల్ కార్పొరేషన్‌గా 2004 నవంబరు 17న ఏర్పడిందన్నారు. నగరం అభివృద్ధి అంతా కాంగ్రెస్ పాలనాకాలంలోనే జరిగిందన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

వైద్య కోర్సుల ఫీజుల పెంపు అన్యాయం

కడప విద్య, న్యూస్‌టుడే: వైద్య కోర్సుల ఫీజుల పెంపును వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. స్థానిక పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నాయకుల సమావేశం నిర్వహించారు. అంకన్న మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో వైద్య పట్టా, దంత వైద్య పట్టా కోర్సుల ఫీజులను 10 శాతం, వైద్య పీజీ కోర్సుల ఫీజులను 15 శాతం పెంచడం అన్యాయమన్నారు. ఇప్పటికే యాజమాన్య కోటా, విదేశీ భారతీయుల కోటా ఫీజులు భారీగా ఉన్నాయన్నారు. ఫీజుల నియంత్రణ కమిటీ పేరుతో తల్లిదండ్రులు, విద్యార్థులతో సమగ్ర చర్చ లేకుండా ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యారుణాలపై రాయితీలను పెంచాలని కోరారు.

సమరశంఖం విజయవంతానికి వినతి

కడప విద్య, న్యూస్‌టుడే : మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరికీ వెంటనే పాత పింఛన్ పునరుద్ధరణ చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకటజనార్దనరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన గుంటూరులో తలపెట్టిన సమరశంఖం సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున హాజరయి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైకాపా నేత అపహరణ అంతా అబద్ధం



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వెంకటరమణయ్య

కమలాపురం, న్యూస్‌టుడే: వైకాపా నాయకుడు సురేష్‌ని కిడ్నాప్ చేశారనడం శుద్ధ అబద్ధమని, ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న డ్రామా అని కమలాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకట రమణయ్య స్పష్టం చేశారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. తెదేపా నాయకుడు పుత్తా నరసింహారెడ్డి ఎలాంటి మచ్చ లేని నాయకుడన్నారు. ఆయన ఆర్య వైశ్యులను ఎంతో గౌరవంగా చేసేవారన్నారు. ఆయన రైల్వే పై వంతెన నిర్మాణం పనుల్లో భాగంగా ఆస్తులు కోల్పోయిన బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు సురేష్‌తో పాటు మిగిలిన బాధితులను పిలిచి మాట్లాడారన్నారు. ఎవరినీ దౌర్జన్యంగా మాట్లాడటం కానీ, కొట్టడం కానీ జరగలేదన్నారు. వైకాపా నాయకులు అభివృద్ధిని ఓర్వ లేక కుట్రపూరిత రాజకీయాలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, దగాజుల సురేష్, బచ్చు ప్రభాకర్, రజని, వడ్ల బాబు, హేమంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభల జయప్రదానికి వినతి

కమలాపురం, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించే డీవైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహా సభలు జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. కమలాపురంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహాసభల్లో రాష్ట్రంలో నిరుద్యోగ యువత సమస్యలపై చర్చిస్తామన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. జిల్లా నాయకుడు సుబహాన్ పాల్గొన్నారు.

● **బిల్టప్ (కడప):** సెప్టెంబరు 1,2,3, తేదిల్లో నెల్లూరులో నిర్వహించనున్న డీవైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, కార్యదర్శి వీరనాల శివ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం వారు గోడ పత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదిల్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నగరం.. అంతర్గత రహదారులు అధ్వానం



కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని తిలక్ నగర్, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి నగర్‌లలో అంతర్గత రహదారులు లేక స్థానిక ప్రజానీకం అవస్థలు పడుతున్నారు. రాళ్లు తేలి గుంతలమయంగా ఉన్న రహదారులు ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారాయి. రెండో డివిజన్, మూడో డివిజన్ రెండింటి పరిధిలోకి వచ్చే పలు వీధులు మౌలిక వసతులు లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ప్రాంతం రోజురోజుకూ విస్తరిస్తుండటం, జనాభా పెరుగుతుండటంతో కనీస సౌకర్యాల కోసం స్థానికులకు ఎదురుచూపులే మిగిలాయి. అంతర్గత రహదారులు నిర్మించాలని కోరుతున్నారు.

కాలువలిలా.. మురుగు పారేదెలా!

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప నగర నడిబొడ్డున ఉన్న మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు చెత్తాచెదారం, వ్యర్థాలతో పేరుకుపోయాయి. మురుగునీరు ముందుకు సాగడం లేదు. ఎక్కడ నీరు అక్కడే నిల్వ ఉంటోంది. కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం పక్కనున్న మురుగు కాలువ వ్యర్థాలు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. నీరు కదలడం లేదు. జిల్లా అధికారి కార్యాలయం పక్కనే ఇలా ఉండటం గమనార్హం. అలానే జడ్పీ ఎదుట ఉన్న మురుగు కాలువ కూడా అధ్వానంగా తయారైంది. కాలువ నిండా వ్యర్థాలు, చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. కాలువకు వ్యర్థాలు అడ్డు పడడంతో మురుగునీరు సక్రమంగా వెళ్లడం లేదు. నగరపాలక అధికారులు స్పందించి వ్యర్థాలు, చెత్తాచెదారాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.













(c) eenadu